ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శుక్రవారం 8 నవంబరు 2024

రేషన్ దందాపై మంత్రి నజర్

- సత్తెనపల్లి, మేడికొండూరు, వట్టిచెరుకూరుల్లో తనిఖీలు
- రైస్‌మిల్లుల్లో 1000 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం గుర్తింపు
- పలు మిల్లులు.. బియ్యం నిల్వల సీజ్.. కేసుల నమోదుకు ఆదేశాలు
- పేరేచర్లలో ఓ రైస్ మిల్లులోనే ఎండీయూ వాహనాన్ని గుర్తించిన మనోహర్
- తనిఖీల విషయం తెలిసి యాజమాన్యం రైస్ బాగ్ ట్యాగ్ల దహనంపై ఆగ్రహం

సత్తెనపల్లి, మేడికొండూరు, గుంటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం బ్లాక్‌మార్కెట్ దందాపై పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ దృష్టి సారించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి, గుంటూరు జిల్లా మేడికొండూరు, వట్టిచెరుకూరు మండలాల పరిధిలో గురువారం రాత్రి మంత్రి ఆకస్మికంగా తనిఖీలు చేశారు. టార్చ్‌లైట్ల వెలుగుల్లో పలు మిల్లుల్లో తనిఖీలు చేసి రేషన్ బియ్యం నిల్వలను గుర్తించి కేసుల నమోదుకు ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పేదల బియ్యం బ్లాక్ మార్కెట్ గుట్టు మంత్రి తనిఖీలతో రట్టయింది. వెయ్యి క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. సత్తెనపల్లిలోని రామలింగేశ్వర ట్రేడర్స్ రైస్‌లో వందలకొద్దీ రైస్ బ్యాగుల్లో చౌక బియ్యం నిల్వలను గుర్తించారు. దాదాపు 100 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ విషయమై స్థానిక తహసీల్దారు చక్రవర్తిని ప్రశ్నించారు. జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి బ్యాగ్‌ని పరిశీలించి క్రిమినల్ కేసు నమోదు చేయాలని, సీజ్ చేయాలని మంత్రి ఆదేశించారు. సీతారామాంజనేయ సాయి, గణేష్ రైస్ మిల్లు ఫ్లోర్, శ్రీదేవి ట్రేడర్స్, రావు రైస్ మిల్లు ఫ్లోర్, సత్తెనపల్లి మండలం కొమెరపూడి రైస్ మిల్లు, సుబ్రహ్మణ్యేశ్వర రైస్ మిల్లుల్లో మంత్రి తనిఖీలు చేశారు.

తొలుత పిచ్చాపాటిగా మాట్లాడి ఆరా..

తనిఖీల్లో భాగంగా తొలుత సత్తెనపల్లికి వచ్చిన మంత్రి మనోహర్ తొలుత రోడ్డు పక్కన కారు ఆపి ఓ బడ్డీ కొట్టు వద్ద సామాన్యుడిలా టీ తాగారు. అక్కడ

(మిగతా 8వ పేజీలో...)


సత్తెనపల్లిలో ఓ మిల్లులో తగలబెట్టిన బిల్లులు, గోతాలను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల మనోహర్


సత్తెనపల్లిలోని ఓ మిల్లులో బియ్యాన్ని పరిశీలిస్తున్న మంత్రి

ఆధునికంగా.. అమరావతి




సమావేశంలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ఆధునిక వనరులతో.. అమరావతిని నెంబర్ వన్ సిటీగా చేసే బాధ్యత నాది. నిర్దిష్ట కాల పరిమితి పెట్టుకుని అమరావతిని అభివృద్ధి చేస్తా. ప్రపంచస్థాయి నగరాల్లో ఉండే సదుపాయాలు కల్పిస్తాను. భూగర్భ విద్యుత్ లైన్లతో అద్భుత నగరాన్ని రెండేళ్లలో సాక్షాత్కరించి రాష్ట్ర ప్రజలకు అందిస్తా. మహిళలు రాజధానిని కాపాడి, నిలబెట్టారు. వారి స్ఫూర్తితో అమరావతిని అద్భుత నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాను.

\- ముఖ్యమంత్రి చంద్రబాబు



- ప్రపంచ స్థాయి నగర నిర్మాణం
- నిర్దిష్ట కాల పరిమితితో రాజధాని అభివృద్ధి
- సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవ సభలో సీఎం చంద్రబాబు నాయుడు


అధికారులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

గుంటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం తాళ్లాయపాలెంలో 400/220 కేవీ సబ్‌స్టేషన్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం ప్రారంభించారు. ఫొటోగ్యాలరీని పరిశీలించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి సబ్‌స్టేషన్‌ను పరిశీలించారు. అనంతరం అక్కడి నుంచే వివిధ జిల్లాల్లో ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌మిషన్ లైన్ల ప్రారంభోత్సవాలు, 15 ప్రాంతాల్లో సబ్‌స్టేషన్లకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు. 2014లో రాజధాని అవసరాల కోసం తాళ్లాయపాలెంలో సబ్‌స్టేషన్‌కు శ్రీకారం చుట్టగా ఐదేళ్ల వైసీపీ విధ్వంసక పాలనలో అది మరుగున పడిపోయిందన్నారు. అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లో తిరిగి దానిని పూర్తిచేసి ప్రారంభించామన్నారు. రూ.509 కోట్లతో ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్‌తో సీఆర్డీఏ భవిష్యత్ అవసరాలతో పాటు రాజధానిలోని పారిశ్రామిక అవసరాలు కూడా తీరుతాయన్నారు. గన్నవరం సబ్‌స్టేషన్‌తో రైతులకు విద్యుత్ అందజేయడం తోపాటు, అంతర్జాతీయ (మిగతా 8వ పేజీలో...)


లాంలో పత్తిపంటను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు



కాంప్లెక్స్ లీజు వేలం ఎప్పటికో?

- రూ.లక్షల్లో ఆదాయం కోల్పోతున్న యార్డు
- లేఖ రాసినా పట్టీపట్టనట్లుగా మార్కెటింగ్ జేడీ
- నాలుగు నెలలుగా కాంప్లెక్స్‌లోని షాపులకు తాళాలు


నరసరావుపేటలోని మార్కెట్ యార్డు షాపింగ్ కాంప్లెక్స్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఆదాయాన్ని కోల్పోతున్నా నరసరావుపేట మార్కెట్ యార్డు అధికారులకు పట్టడంలేదు. యార్డు షాపింగ్ కాంప్లెక్స్ లీజుకు బహిరంగ వేలం నిర్వహించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. లీజు వేలం నిర్వహణలో మార్కెటింగ్ శాఖ జేడీ పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. వేలం నిర్వహించాలని ఇప్పటికి రెండు దఫాలుగా లేఖలు రాసినట్లు స్థానిక యార్డు కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. అయితే జేడీ స్పందించకపోవడం గమనార్హం. నాలుగు నెలలుగా కాంప్లెక్స్‌లోని షాపులకు తాళాలు వేసి ఉన్నాయి. నెలనెలా యార్డు ఆదాయాన్ని చేజార్చుకుంటుంది. షాపులను వదిలేస్తే అవి అన్యాక్రాంతమయ్యే ప్రమాదం ఉంది. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా మార్కెట్ యార్డు 39 షాపులను నిర్మించింది. షాపుల లీజు ద్వారా వచ్చే ఆదాయాన్ని రైతుల ప్రయోజనాలకు వెచ్చించాలి. అయితే ఐదేళ్ల క్రితం షాపుల వేలం నిర్వహించగా అప్పట్లో ఎవరూ పాల్గొనకుండా వైసీపీ నేతలు అడ్డుకుని అతి తక్కువ లీజుకు వారే దక్కించుకున్నారు. ఈ ప్రాంతంలో గిరాకీ ఉన్నా కొన్ని షాపులు ఒక్కొక్కటి రూ.2,904, మరికొన్ని రూ.2,500కు చొప్పున లీజుకు తీసుకున్నారు. తక్కువ లీజుకు షాపులు తీసుకున్న నేతలు రూ 25 వేల వరకు అద్దెలకు సబ్ లీజుకు ఇస్తున్నారు. ఈ అక్రమ లీజుల దందా 15 ఏళ్లుగా సాగుతోంది. దీంతో మార్కెట్ యార్డు రూ.కోట్లల్లో ఆదాయాన్ని కోల్పోయింది. గత ఐదేళ్లుగా లీజుదారులు కనీస అద్దె కూడా యార్డుకు చెల్లించలేదు. చర్యలు తీసుకోవాల్సిన యార్డు అధికారులు లీజుదారుల పంచన చేరిపోయారు. అద్దె బకాయి రూ.18 లక్షలు ఉంది. అద్దె వసూలు కోసం లీజుదారులపై యార్డు అధికారులు కోర్టులో పిటిషన్ దాఖలు చేసేందుకు సమాయత్తమవుతోంది. ఖాళీ చేయని మూడు దుకాణదారులపై యార్డు కార్యదర్శి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే వారిని ఖాళీ చేయించే విషయంలో పోలీసులు యార్డు వర్గాలకు సహరిస్తున్న దాఖలాలు లేవు.

సాగునీటి సంఘాల.. ఎన్నికలకు సమాయత్తం

- 20న నోటిఫికేషన్.. 21న టీసీల ఎన్నిక
- 13న తుది ఓటర్ల జాబితాల విడుదల

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వ యంత్రాంగం సమాయత్తమైంది. దీంతో పల్లెల్లో ఎన్నికల సందడి నెలకొంది. సాగునీటి సంఘాల ఎన్నికల్లో రైతులకు ఓటుహక్కు కల్పించే ప్రక్రియను రెవెన్యూశాఖ చేపటింది. ఓటర్ల జాబితాలను రూపొందిస్తోంది. నాగార్జునసాగర్ కుడికాల్వ ఆయకట్టు పరిధిలో మేజర్, మైనర్ ఇరిగేషన్ శాఖలు ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తున్నాయి. టీసీల వారీగా భూముల వివరాలను రెవెన్యూశాఖకు జలవనరులశాఖ అందజేసింది. సర్వే నెంబర్లు ఆధారంగా భూహక్కు ఉన్న రైతులను గుర్తించి వారికి ఓటుహక్కును రెవెన్యూశాఖ కల్పిస్తోంది. 2,628 టీసీల వారీగా 13వ తేదీన ఓటర్ల తుది జాబితాలను అధికారులు విడుదల చేయనున్నారు. 274 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీటి పరిధిలో 2,628 టీసీలు ఉన్నాయి. ఒక్కొక్క సంఘం పరిధిలో దాదాపు 12 టీసీలు ఉంటాయి. తొలుత టీసీలకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ నెల 20న ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేస్తారు. ఆ మరుసటి రోజు అంటే 21న టీసీలకు ఎన్నికలు జరుగుతాయి. టీసీలకు ఎన్నికైన వారు నీటిసంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. నీటి సంఘాలకు కాల్వ ఎగువ భూముల పరిధిలోని టీసీని అధ్యక్షుడిగా ఎన్నుకుంటే దిగువ భూముల టీసీని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. నీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు డిస్ట్రిబ్యూటరీ కమిటీని ఎన్నుకుంటారు. నీటి పంపిణీలో ఇవి కీలక పాత్ర పోషించనున్నాయి. డీసీలు ప్రాజెక్టు కమిటీని ఎన్నుకుంటాయి. ఎన్నికల నిర్వహణకు సాగు నీటి సంఘాల వారీగా అధికారులను నియమించారు. సమస్యాత్మక నీటి సంఘాలను గుర్తించారు. వీటి ఎన్నికలకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు శాఖను కోరారు. రాజకీయ పార్టీలు ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా స్వీకరిస్తుండటంతో ఏకగ్రీవ ఎన్నికలు జరుగుతాయా లేదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఎక్కువ నీటి సంఘాలకు ఏకగ్రీవ ఎన్నికలు జరిగాయి. ఈ సారి కూడా అదే స్థాయిలో ఏకగ్రీవాలు జరుగుతాయని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే డీసీలను కైవసం చేసుకునేందుకు రాజకీయ పార్టీల నేతలు ఎక్కడికక్కడ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు.


పెదనందిపాడు బ్రాంచ్ కెనాల్

డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఇవే..

నాగార్జునసాగర్ కుడి కాల్వ పరిధిలో 32 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉన్నా యి. వాటి వివరాలు ఇలా ఉన్నాయి. మాచర్ల, గురజాల, కారంపూడి, కేసానుపల్లి, పిడుగురాళ్ల, తంగెడ, బెల్లంకొండ, క్రోసూరు, చామర్రు, నకరికల్లు, ముప్పాళ్ల, సత్తెనపల్లి, మేడికొండూరు, పెదకూరపాడు, అమరావతి, ఫిరంగిపురం, గుంటూరు, పొన్నెకల్లు, లింగంగుంట్ల, చిలకలూరిపేట-1, 2, పెదనందిపాడు, సంతగుడిపాడు, రొంపిచర్ల, గంటావారిపాలెం, వినుకొండ, చీకటీగలపాలెం, ఐనవోలు, త్రిపురాపురం, ములకలూరు, సంతమాగులూరు, కొమ్మాలపాడు డీసీలు ఉన్నాయి.

అడగరు.. అపరు

- కృష్ణానదిలో అడ్డగోలుగా తవ్వకాలు
- కాసులు కురిపిస్తున్న బ్లాక్ మార్కెట్
- జేబులు నింపుకుంటున్న అధికార పార్టీ నేతలు
- అమలు కాని ఉచిత ఇసుక.. మైనింగ్ శాఖ చోద్యం




నరసరావుపేటలోని పల్నాడు రోడ్డులో వేబ్రిడ్జి వద్ద ఇసుక లారీలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సామాన్యులకు అందని ఇసుక అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. అక్రమాలకు అవకాశం ఇవ్వకుండా అందరికీ అందుబాటులో ఉండాలని ప్రభుత్వం ఉచిత ఇసుకను ప్రవేశపెట్టినా అది సక్రమంగా అమలు కావడంలేదు. అధికార పార్టీకి చెందిన కొందరు నాయకులు ఇసుకతో జేబులు నింపుకుంటున్నారు. కృష్ణానదిలో రాత్రి వేళల్లో ఇసుక తవ్వి అధిక ధరలకు అమ్ముకుంటున్నారు. వీరు తీరు అధికారం మాది అడిగేదెవరు.. అడ్డుకునేదెవరు అన్న ధోరణిలో ఉంది. వీరికి కొందరు అధికారులు వంత పాడుతూ ఇసుక అడ్డగోలు తవ్వకాలను ప్రోత్సహిస్తున్నారు. జిల్లాలో ఉచిత ఇసుక లభించడంలేదని వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మాదిపాడు స్టాక్ యార్డులో ఇసుక నిల్వలు నిండుకున్నాయి. జిల్లాలో ఇసుక అక్రమాలపై పర్యవేక్షణ పూర్తిగా కొరవడింది. నరసరావుపేట తదితర ప్రాంతాల్లో రోజూ రెండు వేల మెట్రిక్ టన్నుల ఇసుకను బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఉచిత ఇసుకపై మైనింగ్‌శాఖ పూర్తిగా చేతులెత్తేసింది. మైనింగ్ శాఖ వద్ద ఒక టన్ను కూడా నిల్వ లేదు. ఆన్‌లైన్‌లో కూడా బుకింగ్ అయ్యే పరిస్థితులు లేవు. ఇసుక వినియోగదారులకు సమాధానం చెప్పే పరిస్థితి కూడా జిల్లాలో కనిపించడంలేదు. ప్రభుత్వం చెబుతున్న ఉచిత ఇసుక సరఫరాను జిల్లాలో అమలు చేయడంలేదు. ఇసుక కోసం వినియోగదారులు తీవ్రంగా ఇక్కట్లు పడుతున్నారు. మైనింగ్ శాఖ ఇసుక సరఫరా చేసే పరిస్థితి లేకపోవడంతో వారు బ్లాక్ మార్కెట్‌పై ఆధారపడుతున్నారు. నరసరావుపేటకు రోజుకు 30 నుంచి 40 లారీల ఇసుక అమరావతి ప్రాంతం నుంచి తరలిస్తున్నారు. టన్ను ఇసుక రూ.1,150 నుంచి 1,250 వరకు విక్రయిస్తున్నారు. రాత్రి సమయంలో ఆర్డర్ చేస్తే ఉదయం కల్లా చెప్పిన చోటకు సరఫరా చేస్తున్నారు. అప్పటికప్పుడు ఇసుక కావాల్సినా నరసరావుపేటలో బ్లాక్ మార్కెట్‌లో లభిస్తోంది. పల్నాడు రోడ్డు, సత్తెనపల్లి రహదారి ఇలా వే బ్రిడ్జిలు ఉన్న ప్రాంతాల్లో ఇసుక లారీలు ఉంటున్నాయి. ఇసుక కారణంగా నిర్మాణాలు నిలిచిపోయే పరిస్థితి ఉండటంతో పలువురు అధిక రేటుకైనా బ్లాక్ మార్కెట్‌పై ఆధారపడుతున్నారు. మైనింగ్ శాఖ ఎప్పటికి జిల్లాలో ఉచిత ఇసుకను అమల్లోకి తీసుకొస్తుందో ఆ అధికారులకే తెలియాలి. మైనింగ్ అధికారులు వినియోగదారులకు అందుబాటులోకూడా ఉండటంలేదు. ఇసుక బ్లాక్ మార్కెట్‌పై వివరణ అడిగేందుకు జిల్లా మైనింగ్ అధికారికి కాల్ చేస్తే స్పందించలేదు.

అనధికారికంగా తవ్వకాలు..

కృష్ణానదిలో ఆరు ఇసుక రీచ్‌ల్లో ఇసుక తవ్వకాలకు మైనింగ్ శాఖ టెండర్లు నిర్వహించింది. అయితే ఇంకా అధికారికంగా తవ్వకాలను ప్రారంభించ లేదు. అయినా రీచ్‌ల్లో అనధికారికంగా పెద్ద ఎత్తున ఇసుక తవ్వకా లు జరుగుతున్నాయి. అక్రమార్కులు రాత్రి వేళల్లో తవ్వకాలు చేస్తూ ట్రాక్టర్ల ద్వారా నది నుంచి బయటకు తీసుకువచ్చి నిల్వ చేస్తున్నారు. అనంతరం లారీల ద్వారా బ్లాక్ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా బహిరంగా జరుగుతున్నా అడిగే అధికారే లేరు. అక్రమార్కులకు అధికార పార్టీ నేతల అండదండలు ఉండటంతో ఇసుక అక్రమ రవాణాపై పోలీసుశాఖ కూడా చర్యలు తీసుకోవడం లేదు.

10న చెస్ ఛాంపియన్ షిప్ పోటీలు


గుంటూరు(తూర్పు), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ది ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ (ఏ పీ సీ ఏ), శ్రీ ఆనంద్ చెస్ వింగ్స్ (ఎస్ ఏ సీ డబ్ల్యూ) సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 10న ఆదివారం స్థానిక పట్టాభిపురం, డీఆర్ఎమ్ కార్యాలయంలో రాష్ట్ర బాల, బాలికల చెస్ ఛాంపియన్ షిప్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎమ్ గోపీనాథ్ తెలిపారు. 2వ తరగతి నుంచి ఇంటర్‌మీడియట్ వరకు బాల, బాలికల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. విజేతలకు బాలల దినోత్సవం రోజున పురస్కారాలు అందజేయనున్నట్టు తెలిపారు. ఇతర వివరాలకు 9703049378 నంబరులో సంప్రదించాలని సూచించారు.



ఏఎన్‌వీ లోహిత్ (100 పరుగులు), నౌనిహాల్ (5 వికెట్లు)

హిమాచల్‌ప్రదేశ్‌పై ఆంధ్రా భారీ స్కోరు

మంగళగిరి సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో జరుగుతున్న అండర్-19 కూచ్ బెహర్ ట్రోఫీలో భాగంగా ఆంధ్రా జట్టు హిమాచల్‌ప్రదేశ్‌పై భారీ స్కోరు సాధించింది. 374 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు బ్యాటింగ్ దిగిన ఆంధ్రా జట్టు 155 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 615 పరుగులు చేసి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. తొలిరోజు ఆంధ్రా బ్యాటర్లు ఇద్దరు సెంచరీలు సాధించగా, రెండో రోజు ఏఎన్‌వీ లోహిత్ 121 బంతుల్లో 3 సిక్సర్లు, 7 ఫోర్లతో వంద పరుగులు సాధించి నాటౌట్‌గా నిలిచాడు. కే.రేవంత్ 72, టీ.వరుణ్ సాత్విక్ 68 పరుగులతో రాణించారు. హిమాచల్‌ప్రదేశ్ బౌలర్ ఆర్.నౌనిహాల్ 54 ఓవర్లలో 198 పరుగులు ఇచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన హిమాచల్‌ప్రదేశ్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి 25 ఓవర్లలో ఒక్క వికెట్ నష్టానికి 50 పరుగులు చేసింది. అర్పిత్ సింగ్ 26 పరుగులతో క్రీజులో వున్నాడు. మరో రెండు రోజులు ఆట మిగిలివుంది.



ఎన్జీరంగాపై రచించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు

జమిందారీ వ్యవస్థ రద్దుకు పోరాడిన ఎన్జీ రంగా

● వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు

తాడికొండ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్యం రాకముందు, వచ్చిన తర్వాత దేశంలో జమిందారీ వ్యవస్థను రూపుమాపేందుకు పోరా టాలు చేసి ఆ వ్యవస్థను రద్దు చేసిన వ్యక్తి ఆచార్య ఎన్జీ రంగా అని వ్యవ సాయ శాఖ మంత్రి కే అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఎన్జీ రంగా 124వ జయంతి సందర్భంగా ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యా లయంలో గురువారం ఆయన జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహిం చారు. తొలుత ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ లర్పించారు. సభకు మాజీ ఎంపీ యలమంచిలి శివాజీ అధ్యక్షత వహించారు. మంత్రి మాట్లాడుతూ రైతు బాంధవుడు, ఉపాధ్యాయుడు, రచయిత, ఉత్తమ పార్లమెంటేరియన్ అయిన రంగాను ఉత్తరాంధ్ర ప్రజలు ఆదరించారని అన్నారు. అధునాత విధానంతో వ్యవసాయ చేయ లని రంగా ఆలోచనలు చేశారని గుర్తుచేశారు. రంగా ఆశయాలకు అనుగుణంగా రైతులకే కాకుండా కౌలు రైతులకు కొత్త చట్టాన్ని తీసుకు వస్తు న్నామని, కౌలు రైతుల సలహాలు, రైతు సంఘాలతో చర్చించి కౌలు రైతు చట్టాలను రూపొందిస్తామని అన్నారు. విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు అధునాత వంగడాలను కని పెట్టాలని సూచించారు. రాష్ట్రానికి జాతీయ వ్యవసాయ విశ్వ విద్యాలయాన్ని తీసుకు వచ్చేందుకు కృషి చేస్తామన్నారు. విశ్వ విద్యా లయం భవనాలు త్వరలోనే పూర్తి చేసుకొని ఎన్.జీ.రంగా కాంస్య విగ్ర హాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో గడచిన ఐదేళ్లలో వ్యవసాయ రంగాన్ని నిర్లిప్తితం చేశారని, ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని ప్రోత్సహించి, పూర్వవైభవం తీసుకురావటానికి ప్రణాళికలు సిద్ధం చేస్తోందని చెప్పారు. డ్రోన్ టెక్నాలజీతో వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పు వచ్చిందని, ఏపీలో వీటిని వినియోగించి వ్యవసాయం చేసేందుకు సిద్ధం చేస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో పాటు బ్యాంకులు లోన్లు ఇచ్చే విధంగా డ్రోన్ల వినియోగాన్ని రైతులకు అందించటానికి ప్రభుత్వం కృషి చేస్తోం దని, రాష్ట్రంలో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని చేసే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు.

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ భూస్వాముల వద్దే కాదు అందరి దగ్గర భూములు ఉండాలని పోరాడిన వ్యక్తి ఎన్జీ రంగా అని కొనియాడారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల ఆంజనేయులు మాట్లాడుతూ దేశ జీడీపీలో వ్యవసాయ రంగ భాగాన్ని పెంచేదిశగా ప్రణాళికలు రచించాలని సూచించారు. అనంతరం అభ్యుదయ రైతు నెక్కంటి సుబ్బారావు, అత్త లూరి ఆర్గానిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ సురేంద్రబాబును సన్మానించారు. ఎన్జీ జీవిత చరిత్ర పుస్తకాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీసీ డాక్టర్ ఆర్. శారదా జయలక్ష్మీదేవి, రిజిస్ట్రార్ డాక్టర్ జీ. రామ చంద్రరావు, డాక్టర్ పీ.వీ. సత్యనారాయణ, రైతు నేస్తం వై.వెంకటేశ్వరరావు, రంగ ట్రస్టు సభ్యులు కిషోర్‌బాబు, సజ్జ హేమలత తదితరలు పాల్గొన్నారు.

సందిగ్ధంలో సాగర్ - శ్రీశైలం లాంచీ ప్రయాణం

మాచర్లటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏపీ టూరిజం ఆధ్వర్యంలో ఈ ఏడాది సాగర్ - శ్రీశైలం లాంచీ ప్రయాణంపై సందిగ్ధం నెలకొంది. సాగర్ జలాశయం నిండు కుండలా ఉన్నా శ్రీశైలానికి లాంచీ ప్రయాణంపై ఏపీ పర్యాటక శాఖ ఆసక్తి కనపరచడం లేదు. తెలంగాణ ప్రాంతంలోని నాగార్జున సాగర్ హిల్ కాలనీ నుంచి తెలగాణ టూరిజం ఆధ్వర్యంలో ఈ నెల 2 నుంచి సాగర్ - శ్రీశైలానికి లాంచీ ప్రయాణం మొదలైంది. వివిధ ప్రత్యేక ప్యాకేజీలను తెలంగాణ టూరిజం పర్యాటకులకు అందుబాటులో ఉంచింది. అయితే, ఆంధ్ర ప్రాంతమైన నాగార్జునసాగర్ విజయపురిసౌత్ నుంచి శ్రీశైలంకు లాంచీ ప్రయాణంపై ఏపీ టూరిజం నుంచి ఇప్పటి వరకు ఎటువంటి ప్రకటన విడుదల కాలేదు. ప్రస్తుతం కార్తీక మాసం కావడంతో శ్రీశైలానికి వెళ్లే భక్తులు, పర్యాటకులు సాగర్ - శ్రీశైలం లాంచీ ప్రయాణం కోసం ఎదురుచూస్తున్నారు.



నాగార్జున సాగర్ విజయపురిసౌత్‌లో లాంచీ స్టేషన్ వద్ద లాంచీలు

పర్యాటకులకు మధురానుభూతిని మిగిల్చే ఈ టూరు ఈ ఏడాది ఉన్నట్లా లేనట్లా అని పర్యాటకులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. ఏపీ పర్యాటక శాఖ ఇప్పటివరకు సాగర్ - శ్రీశైలం టూరు కోసం ఎటువంటి ఏర్పాట్లు మొదలు పెట్టకపోవడంతో పర్యాటకులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

మంగళగిరి క్రికెట్ స్టేడియం రూపురేఖలు మారుస్తాం

● ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్

మంగళగిరి సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ వైఖరి కారణంగా తీవ్ర నిర్లక్ష్యానికి గురైన మంగళగిరి క్రికెట్ స్టేడియం రూపురేఖలు మారుస్తామని ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) స్పష్టం చేశారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్ సమావేశం మంగళగిరిలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం కార్యాలయంలో గురువారం జరిగింది. అనంతరం సమావేశ వివరాలను ఎంపీ మీడియాకు వెల్లడించారు. మంగళగిరి క్రికెట్ స్టేడియం అభివృద్ధితోపాటు రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి సంబంధించి 16 అంశాలపై సమావేశంలో చర్చించినట్లు చెప్పారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధి కోసం మూడుచోట్ల క్రికెట్ అకాడమీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, విజయవాడ, అనంతపురం, విశాఖపట్నంలో క్రికెట్ అకాడమీలు ఏర్పాటు కానున్నాయన్నారు. ఈ అకాడమీల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులకు తగిన శిక్షణ ఇప్పిస్తామన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా ఈ స్టేడియం నిర్మాణాలు దెబ్బతిన్నాయని, పన్నెండేళ్ల క్రితం నాటి డిజైన్‌తో ఈ నిర్మాణాన్ని ప్రారం భించడంతో ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా సదు పాయాలు లేవన్నారు. సరైన పార్కింగ్ సదుపాయం ఇప్ప టికీ లేదన్నారు. పార్కింగ్, స్పోర్ట్స్ సెంటరు ఏర్పాటు కోసం 35 ఎకరాల స్థలం అవసరమని, దీనికోసం ఇప్పటికే ప్రభుత్వం,



మాట్లాడుతున్న ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్

సీఆర్డీయేని కోరిందని తెలిపారు. త్వరలో పశ్చిమ బైపాస్ నిర్మాణం పూర్తికానుందని, పశ్చిమ బైపాస్‌తోపాటు సీడ్ యాక్సెస్ రోడ్డు నుంచి మంగళగిరి స్టేడియానికి దారితీసే రహదార్లను అభివృద్ధి చేస్తామని చెప్పారు. మంగళగిరి నుంచి స్టేడియానికి వచ్చే మార్గంలోని రైల్వే గేటు వద్ద నాలుగు వరుసల ఆర్వోబీ నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయని, అన్ని అనుమతులు వచ్చిన వెంటనే ఇప్పటి వరకు వున్న ఇబ్బందులను అధిగమించి మంగళగిరి క్రికెట్ స్టేడియాన్ని అత్యాధునికంగా తీర్చిదిద్దుతామని ఎంపీ శివ నాథ్ స్పష్టం చేశారు. సమావేశంలో ఏసీఏ ఉపాధ్యక్షుడు పీ.వెంకట రామ ప్రశాంత్, కార్యదర్శి సానా సతీశ్, కోశాధికారి దండమూడి శ్రీనివాస్, కౌన్సిలర్ దంతుగౌరు విష్ణుతేజ్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌ని ప్రైవేట్ సూపర్ స్పెషాలిటీలా తీర్చిదిద్దుతాం

● కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు సిటీనవంబరు 7 (ఆంధ్రజ్యోతి):గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిని మరో ఏడాది లోపు ప్రైవేట్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లాగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మ సాని చంద్రశేఖర్ తెలిపారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో శనివారం జరిగిన గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ (హెచ్.డీ.ఎస్) సమావేశంలో పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు మహమ్మద్ నసీర్ అహ్మద్, నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులులతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత సమావేశంలో జరిగిన అం శాలపై తీసు కున్న చర్యలపై చర్చిం చారు. జీజీహెచ్‌లో మెరుగైన మౌలిక సౌకర్యాల కల్పన , జీజీహెచ్ కు వస్తున్న అవుట్ పేషెంట్ల సంఖ్యను క్రమబద్ధీకరించడం, ప్రైమరీ హెల్త్ సెంటర్లు , అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను మరింత బలోపేతం చేయడంపై తీసుకోవాల్సిన చర్యలపై, గుంటూరు జీజీహెచ్ , తెనాలి ప్రభుత్వ ఆసుపత్రిలో జన ఔషధి కేంద్రాలను ఏర్పాటు చేయడం , సర్వీస్ బ్లాక్ పనులు పూర్తి చేయడం , బొంగరలాబీడులోని ఆరు ఎకరాల భూమి ఆక్రమణలకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు వంటి అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు.

అనంతరం కేంద్ర సహాయ మంత్రి మాట్లాడుతూ చాలా సమస్యలను పరిష్కారమయ్యాయని, 'సాహో' పేరుతో ప్రత్యేక ప్రణాళిక ద్వారా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధికి ముందుకు వెళ్తున్నామన్నారు. జీజీహెచ్‌కు రోజుకు వెయ్యి మంది రోగులు అవుట్ పేషెంట్లుగా వస్తున్నారని, ఈ సమస్యను పరిష్కరించేందుకు గ్రామీణ ప్రాంతంలోని ప్రైమరీ హెల్త్ సెంటర్లు, జిల్లాలోని 27 అర్బన్ హెల్త్ సెంటర్లను క్రియాశీలకంగా చేయడం వల్ల జీజీహెచ్ కు ఒత్తిడి తగ్గుతుందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలు ఆరోగ్యాన్ని చూపించుకునేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలని చర్చించినట్లు చెప్పారు. జీజీహెచ్‌లో, తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి జన ఔషధి అదనపు షాపుల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఎస్ఆర్ కింద రూ. 65 లక్షల విలువ గల ఆప్తాల్మజి ఎక్విప్మెంట్ ను అందిస్తున్నట్లు తెలిపారు. జీజీహెచ్‌కు సంబంధించిన సమస్యలపై సిస్టమేటిక్‌గా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మరో ఏడాది లోపు ప్రైవేట్ ఆసుపత్రి లాగా జీజీహెచ్‌ను మారుస్తామని చెప్పారు. స్థానిక బొంగరలా బీడులోని ఆసుపత్రికి సంబంధించి ఆరు ఎకరాల భూమి ఆక్రమణకు గురి కాకుండా ఫెన్సింగ్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అలాగే ఎంసీహెచ్‌కు సంబంధించి



జీ జీహెచ్ సమీక్షలో కేంద్ర మంత్రి చంద్రశేఖర్, ఎమ్మెల్యే నసీర్ , కలెక్టర్ నాగలక్ష్మి

అవసరమైన ఎక్విప్మెంట్‌కు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, సర్వీస్ బ్లాక్ నిర్మాణానికి గతంలో రూ. 5 కోట్లను తులసి రామచంద్ర ప్రభు అందజేస్తామని చెప్పారని అన్నారు. అయితే, ప్రస్తుత అంచనాల ప్రకారం అంతకు మించి ఖర్చు అయ్యే అవకాశం ఉంది కనుక తన స్నేహితుని ద్వారా మరో రూ.కోటి రూపాయలు విరాళంగా తీసుకురాబోతున్నట్లు చెప్పారు. నర్సింగ్ విద్యార్థులకు ఉపయోగపడేలా కాలేజ్‌కి బస్సు ఏర్పాటు చేయడం కోసం ప్రయత్నిస్తున్నామని, రూ. 50 లక్షలు పెట్టి నర్సింగ్ విద్యార్థులకు తులసీ రామచంద్రప్రభు బస్సు ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారని అన్నారు.

సీఎంఆర్ఎఫ్ రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

కాలేయ సమస్యతో బాధపడుతున్న గుంటూరుకు చెందిన కటాలి లక్ష్మణ ఆదిత్య (12) కు ఇటీవలే కాలేయ మార్పిడి జరిగింది. ఆదిత్య కుటుంబ ఆర్థిక సమస్యల కారణంగా మంత్రి చంద్రశేఖర్‌ని సంప్రదించగా ఆయన తక్షణమే స్పందించారు. సమస్యను వివరిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడికి రాసిన లేఖ మేరకు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ నుంచి తక్షణ సాయం అందింది. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి రూ. 7 లక్షల చెక్కును పెమ్మసాని చంద్రశేఖర్, కలెక్టర్, ఎమ్మెల్యే జీఎంసీ కమిషనర్ కలిసి అందజేశారు.

కార్యక్రమంలో కమిటీ సభ్యులు రామచంద్ర ప్రభు, జీజీహెచ్ పర్యవేక్షకులు డాక్టర్ హరిత, జీయంసీ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎస్.వి.రమణ, డాక్టర్ ఎన్. సుందరా చారి, సీపీ రమణ, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి, ఆర్ఎంఓ సతీష్‌కుమార్, అడ్మినిస్ట్రేటర్లు ప్రవీణ్ కుమార్, సీహెచ్. సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంస్థలు రైతులకు అండగా నిలవాలి

● తిమ్మాపురంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి



పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుల్లారావు

యడ్లపాడు, నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి) : రైతుల వద్ద నుంచి పత్తిని ప్రభుత్వ సంస్థలు నేరుగా కొనుగోలు చేసి వారికి అండగా నిలవాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని తిమ్మాపురం పరిధిలోని శ్రీనివాస కాటన్ మిల్లులో కాటన్ కార్పోరేషన్ ఇండియా(సీసీఐ) కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ రాష్ట్రంలోనే తొలి పత్తి కొనుగోలు కేంద్రాన్ని నియోజకవర్గంలో ఏర్పాటు చేయడం జరిగిందని, ఇది రైతులకు ఎంతో మేలు చేసే విషయమన్నారు. కొనుగోలు కేంద్రాలకు తెచ్చిన రోజే తూకం వేయడంతోపాటు నాణ్యతను పరిశీలించి ధర నిర్ణయం జరుగుతుందన్నారు. తేమ శాతం 8 కన్నా తక్కువ ఉంటే మద్దతు ధర రూ.7,521 చెల్లించడం జరుగుతుందన్నారు. అంతకన్నా ఎక్కువ ఉంటే తేమ, పింజ పొడవు ఆధారంగా కనీస ధర రూ.7,124 చెల్లిస్తారని చెప్పారు. అయితే, ప్రస్తుతం సీసీఐ చెల్లిస్తున్న ధర రైతులకు సంతోషాన్ని ఇవ్వలేదని, కేవలం 10 నుంచి 20 క్వింటాళ్ళు దిగుబడి సాధించిన రైతులకు మాత్రమే గిట్టుబాటు అవుతోందని అన్నారు. అధిక వర్షాలు, తెగుళ్ళు సోకి ఈ ఏడాది దిగుబడులు బాగా తగ్గాయని, ఎకరాకు 6 క్వింటాళ్లకు మించి దిగుబడులు వచ్చే పరిస్థితి లేదన్నారు. సీసీఐ ఇస్తున్న మద్దతు ధర కొంత మేర రైతులకు ఊరట నిస్తుందని, ప్రైవేటు వ్యాపారస్తులు ఈ ధరకు కొనుగోలు చేసే పరిస్థితి లేదని, తక్కువ ధరకు బయటి వ్యక్తులకు అమ్ముకోవద్దని సూచించారు. పత్తి రైతులు సంక్షోభంలో ఉన్నారని, ధర ఎంత ఇచ్చినా వారి కష్టాలు తీరవన్నారు. కూలీల కొరత, పెరిగిన పెట్టుబడులు రైతుల నడ్డి విరుస్తున్నాయన్నారు. దూర ప్రాంతాల నుంచి కూలీలను తెచ్చుకుని పనులు చేయించుకునే దుస్థితి నెలకొందన్నారు. దీనికి తోడు టెక్స్‌టైల్ రంగం కూడా సంక్షోభంలో ఉందని, పత్తి కొనేదానికి అమ్మేదానికి పొంతన లేకుండా పోయిందన్నారు. సీఎం చంద్రబాబు రైతులను ఆదుకునేందుకు కూలీల సమస్యను అధిగమించేందుకు డ్రోన్ టెక్నాలజీని తీసుకు వస్తున్నానన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫారసులు అమలు చేయాలన్న ఆలోచనలో కేంద్ర ప్రభుత్వం ఉందన్నారు. కార్యక్రమంలో సీసీఐ ఆర్‌డి రమేష్, సీనియర్ కమర్షియల్ అధికారి రమేష్, జనసేన నాయకులు తోట రాజారమేష్, టీడీపీ నాయకులు కే రఘురామారావు, కే సాయిబాబు, పీ పిచ్చియ్య, ఆలోకం వీరనారాయణ, పీ హనుమంతరావు, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

లా సెట్ అడ్మిషన్ల రిపోర్టింగ్ గడువు నేటి వరకు పెంపు

పెదకాకాని, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఏపీ లా సెట్-2024 ప్రవేశాలకు సంబంధించి సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కళాశాలలో రిపోర్ట్ చేసే గడువు తేదీని ఒక రోజు పొడిగించినట్లు లా సెట్ అడ్మిషన్ల కన్వీనర్ ప్రొఫెసర్ బి. సత్య నారాయణ గురువారం తెలిపారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 7వ తేదీతో ముగిసిందని, విద్యార్థుల కోరిక మేరకు 8 వరకు గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఎవరైన లా సెట్ విద్యార్థులు కళాశాలల్లో రిపోర్ట్ చేయనట్లయితే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు ఏపీ లా సెట్ వెబ్ సైట్ ను చూడాలని సత్యనారాయణ పేర్కొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో గురువారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 8,675 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద రెండు వేల క్యూసె క్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసె క్కులు విడుదల అవుతున్నాయి.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం గురువారం నాటికి 586.20 అడుగులు ఉంది. ఇది 301.04 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 6253 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 4613 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,151 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400, ఎల్ఎల్‌సీ ద్వారా 400 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్ 42,817 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కాగా, శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 57,220 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ తరగతులు

గుంటూరు సిటీ, నవంబరు 7 (ఆంధ్ర జ్యోతి): గుంటూరు, బాపట్ల జిల్లాల అధికారులకు గ్రామ పం చాయతీ అభి వృద్ధి ప్రణాళికలపై శిక్షణా తరగతులు గురువారం నిర్వహించారు. గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఐఆర్ డీపీఆర్ జేడీ ఆర్. కేశవరెడ్డి పాల్గొని మండల పరిషత్ అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. 2025-2026 సంవత్సర ప్రణాళికలు రూపకల్పన స్థానిక అవ సరాలను సామాజిక న్యాయం, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని వర్గాలను అభివృద్ధి చేసే విధంగా ఉండేలా చూడాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నీటివనరుల సంరక్షణ అధి కారి వీ శంకర్,రిసోర్స్ పర్సన్ లలిత, డీ పీ ఎం రవీంద్ర బాబు,ఈ ఓ పీ ఆర్ డీ కె శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జేడీ కేశవరెడ్డి

ఐసీఐసీఐ బ్యాంకులో గోల్ మాల్ కేసులో .. ఒకరి అరెస్టు

చిలకలూరిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఐసీఐసీ బ్యాంకు వివిధ బ్రాంచ్‌లలో నగదు, బంగారం గోల్ మాల్ జరిగిన కేసులో కదలిక వచ్చింది. చిలకలూరిపేట, నరసరావుపేట, విజయవాడ ఐసీఐసీ బ్యాంకు బ్రాంచ్‌లలో జరిగిన అవకతవకలపై సీఐడీ పోలీసులు దర్యాప్తు చేస్తున్న విషయం విదితమే. బ్యాంకు చిలకలూరిపేట బ్రాంచ్‌లో గోల్డ్ లోన్ కౌన్సిలర్‌గా ఉన్న అన్నం హరీష్ (37) ను సీఐడీ అడిషనల్ ఎస్పీ ఆదినారాయణ ఆధ్వర్యంలో గుంటూరులో అరెస్టు చేశారు. సీఐడీ సీఐ సంజీవ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం అరెస్టు అయిన హరీష్ ను విజయవాడలోని థర్డ్ అడిషనల్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరిచారు. అతడికి ఈ నెల 21 వరకు రిమాండ్ విధించారు. విచారణ కోసం అతడిని కస్టడీకి అనుమతించాలని కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. సోమవారం నాడు ఈ విషయంపై నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. ఖాతాదారులకు సంబంధించిన బంగారాన్ని బినామీ పేర్లతో వేరే బ్యాంకులలో, ఫైనాన్స్ కంపెనీలలో డిపాజిట్ చేసి అతడు రుణాన్ని తీసుకున్నట్టుగా సమాచారం. చిలకలూరిపేట బ్రాంచిలో బంగారాన్ని తాకట్టు పెట్టిన ఖాతాదారులకు తెలియకుండా ఎక్కువ మొత్తంలో రుణం మంజూరు చేయించి వారి చేతికి తక్కువ మొత్తం నగదు ఇచ్చి మిగిలింది స్వాహా చేసినట్టుగా కూడా ఆరోపణలు ఉన్నాయి. కాగా, బ్యాంకు మేనేజరుగా వ్యవహరించి కేసులో కీలక వ్యక్తిగా ఉన్న డీ నరేష్ చంద్రశేఖర్ ఇంకా పరారీ లోనే ఉన్నాడు.

ఏం కావాలో స్పష్టంగా తెలుసుకోవాలి

● వ్యక్తిత్వ వికాస నిపుణుడు కెవీ ప్రదీప్



మాట్లాడుతున్న ప్రదీప్

గుంటూరు(విద్య),నవంబరు 7(ఆంధ్రజ్యోతి): యువత జీవితంలో తమకు ఏం కావాలో స్పష్టత ఉండాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు, సినీ,టీవి నటులు కేవీ ప్రదీప్ అన్నారు. వడ్లమూడిలోని విజ్ఞాన్ విశ్వవిద్యాలయంలో గురువారం బీటెక్ విద్యార్థుల కోసం 'టేక్ అప్ టు టేక్ ఓవర్' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలు, బలం, వైఖరి,నైపుణ్యాలు,జ్ఞానం అనే ఐదు లక్షణాలు విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. చివరి సంవత్సరంలో క్యాంపస్ డ్రైవ్‌లో ఉద్యోగం సాధిస్తే ఒత్తిడి తగ్గుతుందని, ఇందుకు ఎంతో కృషి భావ వ్యక్తీకరణ అవసరమని అన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఎప్పటికప్పుడు యువత నూతన ఆలోచనలతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో వీసీ ఆచార్య పీ నాగభూషణ్, డీన్‌లు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.65 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	133, 142,153
చికెన్ విత్ స్కిన్	254.00
చికెన్ స్కిన్ లెస్	264.00

49,882 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 48,327 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 49,882 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 27,397 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	8000	16000	334	8000	15500
నెంబరు. 5	8500	12500	నెంబరు. 5	9500	15000
273	10000	12200	273	9500	15000
341	8000	15500	341	9500	16000
4884	10000	15000	4884	14000	16000
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	17500	తేజ	8500	17500
బ్యాడిగి	8000	14200	బ్యాడిగి	8500	14800
దేవనూరు డీలక్స్	9000	14000	దేవనూరు డీలక్స్	9000	14000
తెల్లకాయలు	4500	10500	తెల్లకాయలు	5000	10000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

ఎమ్మెల్యే చొరవతో సంపద కేంద్రం శుభ్రం



బెల్లంకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ మండలం గంగిరెడ్డిపాలెం గ్రామంలో చెత్త సంపద కేంద్రం అధ్వానంగా ఉందని గ్రామానికి చెందిన ఇద్దరు డయల్ యువర్ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గంగిరెడ్డిపాలెంలోని సమస్యను గ్రామ సర్పంచి అసుల జగన్‌తో చర్చించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. చెత్త సంపద కేంద్రం ముళ్ల పొదలతో నిండి ఉంది. కొంతమంది ఇక్కడ మద్యం తాగి సీసాలు పగులగొడుతున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయగా, గంటల వ్యవధిలోనే జేసీబీ సహకారంతో చెత్త సంపద కేంద్రాన్ని శుభ్రం చేయించారు. సమస్యను పరిష్కరించినందుకు గంగిరెడ్డిపాలెం గ్రామస్తులు ఎమ్మెల్యేకు అభినందనలు తెలిపారు.

ఆర్యవైశ్య యువజన సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శిగా రామకృష్ణ

సత్తెనపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘం కార్యదర్శిగా పట్టణానికి చెందిన కొత్త రామకృష్ణను నియమిస్తూ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.శబరి వర ప్రసాదు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణను ఆర్యవైశ్య నేతలు పలువురు ఘనంగా సన్మానించారు.

చదువుకునేందుకు ఆర్థిక సాయం



తిరుపతమ్మకు చెక్కు అందిస్తున్న ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ సురేఖ

అచ్చంపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన అచ్చంపేటలో డిగ్రీ విద్యార్థిని రాఘవమ్మ తిరుపతమ్మకు స్నేహ హస్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ పి.సురేఖ చేతుల మీదుగా రూ. 25వేల చెక్కును గురువారం అందించారు. అచ్చంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒక సంవత్సరం సీఈసీ గ్రూపు చదివిన అనంతరం చదువుకునే స్తోమత లేకపోవటంతో పొలం పనులకు వెళ్తున్న ఈ విద్యార్థినిని స్నేహ హస్తాల ఫౌండేషన్ ఫీజులు చెల్లించి సత్తెనపల్లిలోని ఎస్‌వీఆర్ డిగ్రీ కళాశాలలో బీకామ్ చదివించేందుకు జాయిన్ చేశారు. డిగ్రీ చదువుకునేందుకు రూ.25 వేల చెక్కును అందించారు. ఉపాధ్యాయులు గీత, గాయత్రి, శివన్నారాయణ, స్నేహ హస్తాల కో-ఆర్డినేటర్ కరిముల్లా బాబు పాల్గొన్నారు.

కూటమి నేతలకు హాని చేస్తే వదిలిపెట్టం

దుర్గి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కూటమి నేతలు, కార్యకర్తలకు వైసీపీ నేతలు హాని చేస్తే వదిలిపెట్టేది లేదని టీడీపీ సీనియర్ నేత, మాచర్ల మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ యాగంటి మల్లికార్జునరావు హెచ్చరించారు. గురువారం ఆయన మండలంలోని శ్యామరాజపురంకు చేరుకొని గత నెల 31వ తేదీన వైసీపీ నేతల దాడిలో గాయపడిన గ్రామానికి చెందిన టీడీపీ నేత గౌరి యాదవ్‌ను పరామర్శించి విలేకరులతో మాట్లాడారు. మాచర్ల మండలం జమ్మలమడక, శ్యామరాజపురంకు చెందిన వైసీపీ నేతలు పథకం ప్రకారం గౌరీ యాదవ్‌పై దాడి చేశారన్నారు. వైసీపీ నేతలు గత వైసీపీ హయాంలో మాదిరిగా హత్యలు, దౌర్జన్యాలు, దాడులు, భూదందాలు, అక్రమాలను కొనసాగిస్తే కూటమి నేతలు వడ్డీతో సహా చెల్లిస్తారని హెచ్చరించారు. దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని యాగంటి డిమాండ్ చేశారు.

పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు

గురజాలటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నిత్యం రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదని జనసేన గురజాల నియోజకవర్గ సమన్వయకర్త కటికం అంకారావు అన్నారు. గురువారం పట్టణంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల సరస్వతి భూముల పరిశీలనకు వచ్చిన పవన్ కల్యాణ్‌పై మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఆయన స్పందిస్తూ విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఓడిపోతే రాజకీయ సన్యాసం చేస్తానని చెప్పిన మహేష్ రెడ్డి మాట నిలబెట్టుకోవాలన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మాచర్లటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని 104 ఉద్యోగులు కోరారు. పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయం వద్ద వారు మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాల్లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం ఇన్‌ఛార్జి తహసీల్దార్ వాణికి వినతిపత్రం అందించారు. 104 జిల్లా కమిటీ వైస్ ప్రెసిడెంట్ సుభాని పాల్గొన్నారు.

మాచవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మాచవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అనుబంధంగా పని చేస్తున్న 104 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలంటూ తహసీల్దార్ క్షమారాణి, ఎంపీడీవో శ్రీనివాసరావుకు గురువారం వినతి పత్రాలు అందజేశారు.

24న యాదవ కార్తీక వన సమారాధన

మాచర్లటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదురుగా ఈనెల 24వ తేదీన జరగనున్న యాదవ కార్తీక వన సమారాధనను జయప్రదం చేయాలని అఖిల భారత యాదవ మహాసభ నేతలు కోరారు. పట్టణంలోని యాదవ సంఘ కార్యాలయం వద్ద గురువారం వారు మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఏజీపీ గొర్రె వెంకటేశ్వర్లు, రిటైర్డ్ డిప్యూటీ డీఈవో గాదె రామకృష్ణారావు, యర్రగడ్డ నాగరాజు, జింకల నాగేశ్వర యాదవ్, మున్నా రాంబాబు, గోళ్ల సురేష్ యాదవ్, కె.నాగరాజు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను ప్రారంభంలోనే గుర్తించాలి

రెంటచింతల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను ప్రారంభంలో గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి బయట పడే అవకాశాలు అధికంగా ఉన్నాయని పీహెచ్‌సీ డాక్టర్ ఎన్.కృష్ణారెడ్డి అన్నారు. వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా గురువారం సిబ్బందితో కలిసి నిర్వహించిన ర్యాలీలో మాట్లాడుతూ ఈ నెల 14 నుంచి మండలంలోని గ్రామాల్లో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఉచితంగా మందులిస్తామన్నారు. డాక్టర్ రమ, ఎంపీహెచ్‌ఈవో శర్మ, కోటేశ్వరరావు, ఆంజనేయులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల వద్ద మద్యం షాపు వద్దంటూ విద్యార్థుల ధర్నా



వైన్స్ షాపు వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థులు

దాచేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీలోని కేశానుపల్లి రోడ్డులో ఏర్పాటు చేసిన మద్యం షాపును తొలగించాలంటూ ప్రైవేటు పాఠశాల విద్యార్థులు రోడ్డుపై ధర్నా చేశారు. గురువారం విద్యార్థులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ దాచేపల్లి - కేశానుపల్లి గ్రామాల మధ్య ఉన్న రైల్వేట్రాక్ వద్ద పల్నాడు వైన్స్ షాపును ఏర్పాటు చేశారని, ఆ రహదారి నుంచి నడిచే గీతాగురుకులం, మహవీర్ స్కూల్స్‌కు వెళ్లే విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉందని ఆరోపించారు. పాఠశాలకు సమీపంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాన్ని తక్షణమే తరలించి విద్యార్థులను ఆదుకోవాలని తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు

చోరీ కేసులో నిందితుల అరెస్టు

అచ్చంపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం మాదిపాడు పంచాయతీ పరిధిలో అటవీ ప్రాంతంలోని సత్తెమ్మతల్లి ఆలయంలో ఆగస్టు 20న ఆభరణాలు, నగదు చోరీకి గురయ్యాయి. విచారణ చేసిన పోలీసులు ఎన్‌టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలానికి చెందిన ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని సొమ్ము స్వాధీనం చేసుకొని గురువారం కోర్టులో హాజరు పరిచారు. ఎన్‌టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలుకు చెందిన ఎర్రబోయిన గోపీ, అద్దంకి గురవయ్య, అద్దంకి శివ(బోడపాడు), ముంగి రాములు(అనిగండ్లపాడు), ముంగి కృష్ణ(సొబ్బాయిగూడెం), పీరం వంశీ(కొల్లికొళ్ళ) గ్రామాలకు చెందిన నిందితుల నుంచి సత్తెమ్మగుడిలోని హుండీ నుంచి రూ 1.70 లక్షలతో పాటు ఒక కేజీ మూడు వందల గ్రాముల వెండి ఆభరణాలు చోరీ చేశారు. వీరి వద్ద నుంచి నగదుతోపాటు ఆభరణాలను స్వాధీనం చేసుకొని వీరిని సత్తెనపల్లి కోర్టులో హాజరు పరిచినట్టు అచ్చంపేట సీఐ వెంకట ప్రసాదు తెలిపారు.

మంచికల్లులో బంగారం చోరీ

రెంటచింతల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మంచికల్లు గ్రామంలో గురువారం రాత్రి చోరీ జరిగింది.సేకరించిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన శీలంనేని అనంతరామయ్య మంగమ్మ దంపతులు తమ కుమారుడు గోపీ వివాహం సందర్భంగా పెళ్లి కార్డులను పంచడానికి ఇతర గ్రామాలకు వెళ్లారు.గురువారం రాత్రి ఇంటికి రాగా తలుపులు తీసి ఉన్నాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాను పగులగొట్టి అందులో ఉంచిన 16 సవర్ల బంగారం అపహరణకు గురైనట్లు గుర్తించారు. దీనివిలువ సుమారు రూ.5 లక్షల వరకు ఉన్నట్లు సమాచారం. ఎస్ఐ సీహెచ్ నాగార్జున దర్యాప్తు చేస్తున్నారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు

● గత ప్రభుత్వ నిర్వాకంతో చిన్నారులకు ఇబ్బందులు



పిడుగురాళ్లలో కొనసాగుతున్న అంగన్‌వాడీ అద్దె భవనం

పిడుగురాళ్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గంలోని పిడుగురాళ్ల, గురజాల ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో దాచేపల్లి, గురజాల, మాచవరం, పిడుగురాళ్ల మండలాలు వున్నాయి. వాటిల్లో మూడొంతులకు పైగా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. 2014-19 వరకు ఉన్న చంద్రబాబు ప్రభుత్వంలో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణానికి ఏర్పాట్లు జరిగాయి. స్థల సేకరణ కొంతమేర నిధులు కూడా మంజూరు చేశారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన జగన్ ప్రభుత్వం మంచి ఆలోచనను నీరుగార్చింది. ఫలితంగా బుడి బుడి నడకలతో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఇబ్బందులు తప్పడం లేదు. వసతుల లేమితో కునారిల్లుతున్న అద్దె భవనాల్లో కేంద్రాలు నడపలేక కార్యకర్తలు అల్లాడిపోతున్నారు. 2014-19 మధ్యకాలంలో ప్రతి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సాధ్యమైన మేర అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించేందుకు ప్రభుత్వం స్థల సేకరణ పూర్తి చేయడమే కాకుండా కొంత నిధులు కూడా మంజూరు చేసింది. ఉపాధి హామీ పథకం నిధులతో జతకలిపి ప్రభుత్వం గ్రాంటుతో నిర్మాణాలు పూర్తిచేసే విధంగా అప్పట్లో చంద్రబాబు తీసుకున్న నిర్ణయం మంచిదేనని, తద్వారా ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి సకల సౌకర్యాలతో భవనాలు సమకూరుతాయని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు భావించారు. తరువాత అధికారంలోకి వచ్చిన జగన్ గతంలో అంగన్‌వాడీ కేంద్రాలకు కేటాయించిన స్థలాలను సైతం తిరిగి గ్రామ పంచాయతీల చేతుల్లో పెట్టారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల సొంత భవనం నిర్మాణం కల కలగానే మిగిలిపోయింది. గురజాల నియోజకవర్గ పరిధిలో మొత్తం 4 మండలాల్లో 315 అంగన్‌వాడీ కేంద్రాలకు గానూ 37 కేంద్రాలకు సొంత భవనాలు ఉండగా, మరో 33 అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ హాల్స్, ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్నాయి. ఇకపోతే 245 కేంద్రాలకు అద్దె భవనాలే దిక్కయ్యాయి. సరైన వసతుల్లేక గాలి వెలుతురు లేని ఇరుకైన భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు కొనసాగుతుండటం ఆ ప్రభావం చిన్నారులపై పడుతుంది. పట్టణాల్లో అద్దె భవనాలకు రూ. 4 వేల వరకు, గ్రామీణ ప్రాంతాల్లో రూ. 2 వేల వరకు అద్దె చెల్లిస్తున్నారు. ప్రతినెలా అద్దెలు సకాలంలో జమకాకపోవడం, ఇంటి యజమానితో గొడవలు పడలేక కొందరు అంగన్‌వాడీ కార్యకర్తలే చేతి డబ్బులు భవన యజమానులకు ఇచ్చి బిల్లు వచ్చిన తరువాత తీసుకుంటున్న దాఖలాలు నేటికీ కొనసాగుతున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులు కోరుతున్నారు.

వివరాలు ఉన్నతాధికారులకు పంపించాం



ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల వివరాలు ఐసీడీఎస్ ఉన్నతాధికారులకు పంపాం. ఇప్పటికే దాచేపల్లి, పిడుగురాళ్ల, మాచవరం, గురజాల మండలాల పరిధిలో అద్దె భవనాల్లో కొన్నింటిలో వసతులు లేవని గుర్తించాం.

- సీడీపీవో రుక్సానాబేగం

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి కృషి



అయ్యప్ప ఆలయ నమూనాను ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డికి అందజేస్తున్న గోలి పెద్దలు

రెంటచింతల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయ సహకారాలందిస్తానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పారు. గోలి గ్రామానికి చెందిన అయ్యప్ప భక్తులు, టీడీపీ నేతలు గురువారం ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డిని కలిసి గ్రామంలో నిర్మించబోయే అయ్యప్ప ఆలయ నమూనాను అందజేశారు. ఈ నెల 17న ఆలయ నిర్మాణానికి జరగబోయే భూమి పూజ, మహాపడి పూజలో పాల్గొనాలని ఆహ్వానించారు. 9 ఎకరాల విస్తీర్ణంలో 108 అడుగుల ఎత్తుండే అయ్యప్ప విగ్రహాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఇంకా అనేక ఆలయాలు నిర్మించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. ఆలయ ధర్మకర్త త్రిపుర కృష్ణారావు, పటాల సుబ్బారావు, కోరే నాగేశ్వరరావు, కోటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, గొంటు సుమంత్‌రెడ్డి, బోడపాటి రామకృష్ణ, ప్రభురాజు, శౌరెడ్డి తదితరులున్నారు.

నెలకు ఐదు కాన్పులు తప్పనిసరి



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పద్మావతి

రాజుపాలెం, నవంబరు 7: ఆసుపత్రిలో నెలకు ఐదు కాన్పులు తప్పనిసరిగా చేయాలని జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పద్మావతి ఆదేశించారు. గురువారం మండలంలోని రాజుపాలెం గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పద్మావతి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో జరిగే కాన్పుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులు, బాలింతలకు చేసే సేవలు, శిశువులకు ఇచ్చే టీకాల నమోదు, ఆన్‌లైన్‌లో మ్యాపింగ్, వయోజనుల బీసీజీ టీకాల రిజిస్టర్లు పరిశీలించారు. వాటి వివరాలను వైద్యులు రవితేజ నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా అన్ని రకాల సేవలను మెరుగుపరచటానికి సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

రసాయన ఎరువులు తగ్గించి.. జీవ ఎరువులు వాడండి



శిక్షణ ఇస్తున్న జిల్లా వనరుల కేంద్రం ఏవో ప్రవీణ్

మాచవరం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతులు ఒకరిని చూసి మరొకరు పోటీలు పడి రసాయానిక ఎరువులను అధికంగా వాడుతున్నారని, అవి తగ్గించి జీవ ఎరువులు ఎక్కువగా వాడితే తక్కువ ఖర్చుతోపాటు అధిక దిగుబడులు సాధించి లాభాలు పొందటానికి అవకాశం ఉంటుందని పల్నాడు జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి ప్రవీణ్ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని కొత్తగణేషునిపాడు గ్రామంలో సర్పంచి పొందూరి నరసింహారావు సమగ్ర వ్యవసాయ క్షేత్రంలో సబ్ డివిజన్ స్థాయిలో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ కార్యక్రమానికి పిడుగురాళ్ళ, మాచవరం, నకరికల్లు, కారంపూడి, దాచేపల్లి మండలాల వ్యవసాయ శాఖ సిబ్బంది హాజరయ్యారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి ప్రవీణ్ మాట్లాడుతూ రైతులకు రసాయాన ఎరువుల వాడకం తగ్గించి జీవ ఎరువులు వాడటం వల్ల కలిగే ఉపయోగాలు వివరించాలని వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచించారు. పిడుగురాళ్ళ ఏడీఏ శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ రబీ కాలంలో మొక్కజొన్న పంట యాజమాన్యం, వివిధ పథకాల గురించి వివరించారు. చేపలు, గొర్రెలు, కోళ్ళ పెంపకంతో పాటు కూరగాయలు, వరి పండ్ల తోటలు పండించు కోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు కే రామమ్మ, డీ పాప కుమారి, ఎన్ శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ పొందూరి నరసింహారావు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

క్రోసూరు, నవంబరు 7 : క్యానర్ వ్యాధి పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ముఖ్యంగా మహిళలు వ్యాధి గురించి పూర్తిగా తెలుసుకోవాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ధనుష్ అన్నారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా గురువారం మండలంలోని ఎర్రబాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ధనుష్ మాట్లాడుతూ ప్రభుత్వం క్యాన్సర్ వ్యాధిని మొదట్లోనే గుర్తించటానికి అనేక రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. 18 సంవత్సరాల నిండిన వారికి ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తుందన్నారు. మహిళలకు క్యాన్సర్ పై అవగాహన లేకపోవటం వల్ల చాలా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. 12 సంవత్సరాల కంటే ముందే రజస్వలు కావటం, పిల్లలు లేని మహిళలు, ఊబకాయం ఉన్న మహిళలు, మద్యం, పొగాకు తదితర అలవాట్లు ఉన్న వారికి క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉంటాయన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి శిఖా శ్యామ్‌సన్, హెల్త్ విజిటర్ అమర జ్యోతి, శివుడు, ప్రభావతి, సీహెచ్‌వో రజిని పాల్గొన్నారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

క్రోసూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రైతులు పంటల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలు పాటించాలని జిల్లా రైతు శిక్షణా అధికారి ఎం శివ కుమారి అన్నారు. గురువారం మండలంలోని పీసపాడులో రైతు శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తి పంటలో పొగాకు, లద్దె పురుగు, గులాబీ రంగు పురుగు, మిర్చి పంటలో సూక్ష్మ పోషక లోపాలు, తామర పురుగులు ఆశించి ఉన్నాయన్నారు. వాటి నివారణకు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని ఆమె చెప్పారు. కార్యక్రమంలో పాల్గొన్న క్రోసూరు ఏడీఏ హనుమంతరావు మాట్లాడుతూ రైతులు ఈ రబీ సీజన్ నుంచి క్రాపు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. వరి పంట పండించే రైతులు ఎకరాకు రూ. 630 చొప్పున డిసెంబరు 15వ తేదీ లోగా సీఎస్‌సీ సెంటర్‌లో గాని, పీఏసీఎస్‌లలో గాని ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

గ్రామ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలి



పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న జిల్లా అధ్యక్షుడు ఆలోకం సుధాకర్

క్రోసూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లాలో గ్రామ స్థాయి నుంచి భారతీయ జనతా పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలపై ఉందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆలోకం సుధాకర్ అన్నారు. గురువారం నరసరావుపేటలోని జిల్లా పార్టీ కార్యాలయంలో క్రోసూరు మండలానికి చెందిన బీజేపీ నాయకులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా మండలంలోని గరికపాడు, గాదెవారిపాలెం గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు కొందరు బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన రెండు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు మేకల వెంకటేశ్వర్లు, రావూరి మహంకాళి, రావూరి కామేశ్వరరావుల మెడలో బీజేపీ కండువాలు వేసి ఆయన పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సాధిస్తున్న విజయాలు ప్రజలకు తెలియజేయలన్నారు. వైసీపీ నుంచి బీజేపీలోకి వచ్చిన నాయకులకు తగిన ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నియోజక వర్గ కన్వీనర్ తమ్మా వెంగళరెడ్డి, ఒంగోలు జిల్లా ఇన్‌చార్జ్ పునుగుళ్ళ రవి శంకర్, జెడ్‌యూఆర్‌సీసీ సభ్యులు గోరంట్ల సత్యనారాయణ, బీజేపీ పార్టీ నాయకులు నారు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రాజ్య పురస్కార్‌ను అందుకున్న విద్యార్థికి అభినందనలు

నకరికల్లు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా పల్నాడు జిల్లా నకరికల్లు మండలం కండ్లకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న చీమలమర్రికి చెందిన ఉప్పలపాటి మహేష్ రాజ్య పురస్కార్‌ను గురువారం విజయవాడలో అందుకున్నారు. 75వ భారత స్కౌట్స్ గైడ్స్ అవతరణ దినోత్సవంలో రాజ్య పురస్కార్‌కు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిభ కనబరిచిన పది మంది విద్యార్థులను ఎంపిక చేశారు. ఉప్పలపాటి మహేష్ ఈ పురస్కారానికి ఎంపికైన సందర్భంగా జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం బీవీవీఎల్ వర ప్రసాదు, స్కౌంట్ మాస్టర్ డాక్టర్ ఉన్న పద్మావతి, ఎస్‌వోసీ శ్రీనివాసరావు, ఎంఈవో ఎంఎల్ఎన్ ప్రసాదులు అభినందించారు.

వైద్యశాల అభివృద్ధిపై మంత్రితో చర్చ



వైద్య ఆరోగ్య శాఖ మంత్రితో ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి శాసన సభ్యులు కన్నా లక్ష్మీనారాయణ గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్‌ను విజయవాడలోని కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను ఆయన మంత్రితో మాట్లాడారు. ఏరియా వైద్యశాలలో ఉన్న ఆక్సిజన్ ప్లాంట్ల మరమ్మతులు, పోస్టుమార్టమ్ రూమ్‌లో ఏసీ సౌకర్యం ఏర్పాటు చేయాలని, కంటి ఆపరేషన్‌లు చేయటానికి అవసరమైన సర్జికల్ మెటీరియల్‌ను అందించాలని, గర్భిణులకు స్కానింగ్ చేసేందుకు అవసరమైన రేడియాలజిస్టు డాక్టర్‌ను వెంటనే నియమించాలని, ఇంకా పలు అంశాలపై మంత్రితో కన్నా చర్చించారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో డీఎంఅండ్‌హెచ్‌వో తనిఖీ

దాచేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లిలోని ప్రైవేటు ఆసుపత్రులను పల్నాడు జిల్లా డీఎంఅండ్‌హెచ్‌వో రవికుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. ఇటీవల కొంతమంది వ్యక్తులు ప్రైవేటు ఆస్పత్రుల తీరుపై డీఎంఅండ్‌హెచ్‌వోకు ఫిర్యాదు చేశారు. అవసరం ఉన్నా లేకున్నా టెస్టులు నిర్వహించడం, ఆసుపత్రుల్లో సౌకర్యాలు లేకపోయినా రోగులను చేర్చుకోవడం, అర్హత లేకున్నా వైద్యసేవలు అందించడం వంటి పలురకాల ఆరోపణలు చేస్తూ ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నారాయణపురంలోని 8 ఆసుపత్రులను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఇటీవల అంజనాపురం కాలనీలో అతిసార వ్యాపించడం, టైఫాయిడ్ జ్వరాలు కూడా విస్తారంగా రావడంతో ఆయన పల్నాడు ప్రాంతంలో పర్యటించారు.

పోలీసులు బెదిరింపులకు పాల్పడలేదు

గురజాలటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దుర్గి మండలం మించాలపాడుకు చెందిన మాజీ సర్పంచి పలపాల వెంకటేశ్వర్లు పట్ల తమ సిబ్బంది బెదిరింపులకు పాల్పడలేదని గురజాల డీఎస్పీ జగదీష్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ మించాలపాడు గ్రామంలో 2020లో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌లో మోటారు అపహరణకు గురైందని ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి తమకు ఫిర్యాదు చేశారన్నారు. దీనిపై విచారించగా గ్రామ మాజీ సర్పంచి పలపాల వెంకటేశ్వర్లు మోటారును తీసుకొని విక్రయించుకున్నారని తెలిసిందన్నారు. దీనిపై వెంకటేశ్వర్లును విచారించగా ఈనెల 5వ తేదీ కల్లా బిగించి ఇస్తానని గ్రామ పెద్దలు మిర్యాల సుబ్బారావు, పలపాల గోవిందు సమక్షంలో ఒప్పుకొని బిగించలేదన్నారు. దీనిపై వెంకటేశ్వర్లును రమ్మని కబురు పెట్టామని, అంతేగానీ కొట్టడం గానీ, పదేపదే పిలిపించడం గానీ చేయలేదన్నారు. అయితే వెంకటేశ్వర్లు చేసిన సెల్ఫీ వీడియోలో వ్యాఖ్యలు పూర్తిగా అసత్యమన్నారు.

అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

క్రోసూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు కృష్ణ మాదిగపై వైసీపీ నాయకుడు విజయ సాయిరెడ్డి అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు గడ్డిపర్తి శ్రీనివాసరావు మాదిగ అన్నారు. గురువారం ఆయన క్రోసూరులో విలేకరులతో మాట్లాడుతూ మందా కృష్ణ మాదిగ చంద్రబాబును కలసి ఎస్సీ వర్గీకరణ త్వరగా అమలు చేయాలని, మాదిగ ఉప కులాలకు న్యాయం చేయాలని, ఇది జరిగిన తరువాతనే ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారన్నారు. కృష్ణ మాదిగ గురించి మాట్లాడే అర్హత విజయ సాయికి లేదన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కాంద్రు కాశయ్య, దుద్దుల యోహాన్, చిలకా శ్రీను, చిలకా చంద్రశేఖర్, గుడేటి చిన ప్రకాశం, ఏసుబాబు, జయపాల్ పాల్గొన్నారు.

గోపాల మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

క్రోసూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పశు సంవర్ధక శాఖలో పని చేస్తున్న గోపాల మిత్రలకు ఉద్యోగ భద్రత కల్పించాలని క్రోసూరు మండలానికి చెందిన పలువురు విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు. మూడు దశాబ్దాల క్రితం ఉమ్మడి రాష్ట్ర సీఎంగా ఉన్న సమయంలో చంద్రబాబే తమను నియమించారని, విజన్ 20 - 20లో భాగంగా ప్రతి గ్రామీణ ప్రాంతంలో సేవలు అందించేందుకు తమకు శిక్షణ ఇచ్చి ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి గౌరవ వేతనంతో తమను నియమించారన్నారు. అప్పటి నుంచి గ్రామీణ ప్రాంతాల్లో తాము అలుపెరగని సేవలు అందజేస్తున్నామన్నారు. తమ సర్వీసులను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ మేరకు పశు సంవర్ధక శాఖ మంత్రికి, కమిషనర్‌కు, కార్యదర్శికి, స్థానిక ఎమ్మెల్యేకు వినతి పత్రాలు పంపుతున్నట్టు చెప్పారు. గోపాల మిత్రలు ఈ కోటేశ్వరరావు, కోటి రామ్మూర్తి, మన్నెపల్లి రామారావు, గొర్రెపాటి మనోహరరావు, షేక్ నబీ తదితరులు మాట్లాడారు.

ప్రతిభ గల యువకులను గుర్తించండి

దుర్గి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నిరుద్యోగం లేని ఆంధ్రగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ముందుకెళ్తున్నారని ఎంపీపీ సునీతాశంకర్ అన్నారు. గురువారం దుర్గి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్కిల్ సెన్సెక్స్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో ప్రతిభ గల యువతను గుర్తించి ఆన్‌లైన్ చేయాలని అధికారులకు సూచించారు. చేతి వృత్తుల వారికి రుణాలు ఇప్పించడం, నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన చేస్తామన్నారు. ఎంపీడీవో శివప్రసాద్, ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, ఏవో హనుమంతురావు, కార్యదర్శులు సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలి

క్రోసూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : స్వయం సహాయక సంఘాలను అన్ని రంగాల్లో బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ బాలూ నాయక్ అన్నారు. గురువారం క్రోసూరు వెలుగు కార్యాలయంలో సీఆర్‌పీఎస్‌లకు ఆడిట్ శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో స్వయం సహాయక సంఘాల వారు ఏర్పాటు చేసుకొనే సమావేశాలకు సీఆర్‌పీఎస్‌లు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. వెలుగు ఏపీఎం కృపావేణి, ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ నాగూర్, ఇన్‌ఛార్జి సుబ్బారావు, సీసీలు, సదా, నరసింహారావు, సుభాని, నాగరా కుమారి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

మాచర్లటౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి గురువారం మృతి చెందారు. పట్టణ ఎస్ఐ సంధ్యారాణి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో ఓ వ్యక్తి అనారోగ్యంతో పడి ఉండడాన్ని ఓ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు గుర్తించారు. మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటకు పంపారు. పరిస్థితి విషమించి గురువారం ఆ వ్యక్తి మృతి చెందాడు. మృతుని వయసు 45 ఏళ్లు ఉంటుందని, బ్లూ కలర్ ప్యాంటు, లేత పసుపురంగు టీషర్టు ధరించినట్లు చెప్పారు. సమాచారం కోసం 9440796240 సంప్రదించాలని ఎస్.ఐ తెలిపారు.


కొమెరపూడి గ్రామం

కొమెరపూడి ఉపాధ్యాయులకు నిలయం

- గ్రామంలో 90 మంది వరకు ఉపాధ్యాయులు
- యువతకు ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతోనే..


కొమెరపూడి జడ్పీ హైస్కూల్

'మాతృ దేవోభవ, పితృ దేవోభవ, ఆచార్య దేవో భవ' అంటారు. జన్మనిచ్చిన తల్లిదండ్రుల తరువాత స్థానం ఉపాధ్యాయులది. అలాంటి ఉపాధ్యా యులకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది సత్తెనపల్లి మండలంలోని కొమెరపూడి. ఈ గ్రామంలో ఎక్కువ మంది ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారు. 90 మంది వరకు ఉంటారు. పేద కుటుంబాల్లోని వ్యక్తులు చదువుల తల్లిని నమ్ముకొని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగారు. 'ఒక ఇంజనీరు తప్పు చేస్తే తాను నిర్మించిన బ్రిడ్జి మాత్ర మే కూలిపోతుంది. ఉపాధ్యాయుడు తప్పు చేస్తే సమాజమే పెడదారి పడుతుంది' అనేది లోకోక్తి. బాధ్యతాయుతంగా ఉంటున్న ఈ ఉపాధ్యాయులు ఈ గ్రామానికే వన్నె తెస్తున్నారు.

సత్తెనపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఒకే ఇంటిలో ఇద్దరు, ముగ్గురు ఉపాధ్యాయులు కూడా ఉన్నారు. ఉపాధ్యాయవృత్తిలో ఉన్న వారి తల్లిదం డ్రులంతా ఎక్కువగా వ్యవసాయ కూలీలు, చిన్న వ్యాపారాలు చేసుకొనేవారే. సాధారణ ,దిగువ, మధ్య తరగతి వారు నివసించే ఈ గ్రామంలో రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద ముస్లింలు ఎక్కువగా ఉన్నారు. ప్రతి డీఎస్సీలోను ముస్లింపాలెంకు చెందిన యువతీ యువకులు ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికవుతున్నారు. కొమెరపూడిలో 10వ తరగతి వరకు చదువుకొని అక్కడి నుంచి సత్తెన పల్లిలో ఇంటర్ పూర్తి చేసి బీఈడీ పూర్తిచేసిన వారిలో ఎక్కువ మంది ఉపాధ్యాయవృత్తిలోనే ఉన్నారు. ప్రభుత్వం ఉర్దూ టీచర్ పోస్టులను ఎక్కువగా భర్తీ చేస్తుండటంతో.. ఇంటర్ మీడియట్‌లో రెండవ లాంగ్వేజ్‌గా 'ఉర్దూ' తీసుకుని, ఇంటర్ అనంతరం బీఈడీలో కూడా ఉర్దూ పూర్తిచేసి ఉపాధ్యాయవృ త్తిలో స్థిర పడుతున్నారు. దీంతో ఆ గ్రామంలో చదువుకునే యువత దృష్టి ఉపాధ్యాయ వృత్తిపైనే పడింది. పది మంది వరకు విశ్రాంత ఉపాధ్యాయులు ఉన్నారన్నారు.

బోధనపై మక్కువతో..

గ్రామంలోని ఐదారు ముస్లిం కుటుంబాల్లో భార్యాభర్తలు, అన్నదమ్ములు, అక్కా చెల్లెలు, అన్నా చెల్లెలు ఉపాధ్యాయులుగా ఉండటం విశేషం. ఈ తరం వారు వారిని చూసి బోధనపై ఎక్కువగా మక్కువ పెంచుకున్నారు. టీటీసీ, బీఈడీ లాంటి చదువులు చదివి బోధనలో స్థిర పడుతున్నారు. ముస్లింపాలెంలో ఎక్కువగా యువతీ యువకులు ఉపాధ్యాయ కొలువు పొందాలన్నదే లక్ష్యంగా చదివారు. నాలుగు వందల వరకు ముస్లిం కుటుంబాలు ఉంటే మూడు వందల కుటుంబాల్లో ఒక రిద్దరు డిగ్రీలు, పీజీలు, టీటీసీ, బీఈడీ చేశారంటే నాటి యువతలో బోధనపై వారికి ఎంత మక్కువ ఉందో అర్థమవుతుంది.

ఎంతో గర్వంగా ఉంది



మా తండ్రి ఉపాధ్యాయునిగా పని చేశారు. నేను కూడా ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో బీఈడీ పూర్తి చేసిన అనంతరం డీఎస్సీలో ఉపాధ్యాయురాలిగా ఎంపికై క్రోసూరు మండలం అనంతవరం పాఠశాలలో పని చేస్తున్నాను. ఉపాధ్యాయ వృత్తి ద్వారా భావి భారత పౌరులను తీర్చిదిద్దే అవకాశం లభించటం సంతోషంగా ఉంది. మా గ్రామంలో ఉన్నంత మంది ఉపాధ్యాయులు బహుశ ఎక్కడ ఉండరేమో. ఈ విషయాన్ని మేము బయట ఎక్కడైనా చెప్పుకోవాలన్నా ఎంతో గర్వంగా ఉంటుంది.

-షేక్ రజియా బేగం, సెకండరీ గ్రేడు టీచర్, అనంతవరం

ఎందరికో ఓనమాలు నేర్పిన పాఠశాల : జీ సదాశివరెడ్డి, దొడ్లేరు



ఉపాధ్యాయ వృత్తిలో గౌరవం ఎక్కువగా లభిస్తుంది. ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో బీఈడీ పూర్తి చేసి డీఎస్సీలో ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యాను. క్రోసూరు మండలం దొడ్లేరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్నాను. కొమెరపూడికి జిల్లా పరిషత్ హైస్కూల్ గుండె కాయ లాంటిది. నా లాగా ఎంద రికో ఓనమాలు నేర్పి ఉద్యోగులుగా తీర్చిదిద్దింది.

తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు



మా గ్రామంలో ఉపాధ్యాయ ఉద్యోగం చేసే వారి సంఖ్య ఎక్కువ. వీరే కాకుండా ఇతర ఉద్యోగస్తులు కూడా ఉన్నారు. వీరందరినీ కొమెరపూడి హైస్కూల్ ఉపాధ్యాయులు తీర్చిదిద్దారు. హైస్కూల్ చదువులు అయిపోయిన తర్వాత బయట చదువుకొని ఉద్యోగాలు సంపాదిస్తున్నారు. ఇది చాలా సంతోషం.

యర్రా వెంకటేశ్వరరావు, పాలకేంద్రం అధ్యక్షుడు, కొమెరపూడి

ఏ ఊరిలో లేరు : దేవరకొండ వెంకటరావు, మాజీ సర్పంచ్, కొమెరపూడి



మా గ్రామంలో ఉన్నంత మంది ఉద్యోగులు ఏ ఊరిలో ఉండరు. ఎక్కువ మంది ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నారు. అందులో ముస్లింపాలెంలోని యువతీ యువకులు ఎక్కువగా ఉన్నారు. ఇంకా సచివాలయ ఉద్యోగులు, మిలటరీలో పని చేసే వారు, పోలీసు శాఖలో పని చేసే వారు కూడా ఉన్నారు. ఈ విషయాన్ని మేము బయట చెప్పకోవాలంటే ఎంతో గర్వంగా ఉంటుంది.

ఐదుగురినీ బీఈడీ చదివించారు : ఎస్‌ఎం రెహ్మాన్, సెకండరీ గ్రేడ్ టీచర్, ఫణిదం



మానాన్న ఉపాధ్యాయుడు. మేము ఐదుగురు సంతానం. ముగ్గురు అబ్బాయిలు, ఇద్దరు అమ్మాయిలు. అందరినీ బీఈడీ చదివించారు. ముగ్గురూ ఉపాధ్యాయులుగా పని చేస్తున్నాం. ఒక అమ్మాయి కూడా సెకండరీ గ్రేడ్ టీచర్. తక్కువ జీతంతో మానాన్న కష్టపడి చదివించాడు. క్రమశిక్షణగా చదివి ఉపాధ్యాయ ఉద్యోగాలను మెరిట్‌లో సాధించినందుకు సంతోషంగా ఉంది.

రైతు కూలీ కుటుంబం మాది : షేక్ హజరాబీ, సెకండరీ గ్రేడ్ టీచర్, కంకణాలపల్లి



రైతు కూలీ కుటుంబం మాది. మా ఇంట్లో ఐదుగురు మగపిల్లలు, ముగ్గురు ఆడపిల్లలు. తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకుంటూ మమ్మల్ని కష్టపడి చదివించారు. నేను బీఈడీ పూర్తి చేసి 2008లో డీఎస్సీలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా ఎంపికయ్యాను. సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి పాఠశాలలో పని చేస్తున్నాను. గ్రామంలోని ముస్లిం పిల్లలంతా ప్రభుత్వ హైస్కూల్‌లో చదివి మంచి స్థాయికి ఎదిగాం. ప్రభుత్వ ఉద్యోగాలు పొందటానికి ముస్లిం పాలెంలో యువత ఎక్కువగా పోటీ పడతారు.

ఆధునికంగా.. అమరావతి

(5వ పేజీ తరువాయి)

విమానాశ్రయానికి ఒక ఫీడర్ కేటాయించి విద్యుత్ అవసరాలు తీరుస్తున్నామన్నారు. పెడన సబ్‌స్టేషన్‌తో ఆక్వా పరిశ్రమకు మేలు జరుగుతుందన్నారు. శ్రీకాకుళం సబ్


సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవానికి హాజరైన ప్రజలు

స్టేషన్‌తో కొబ్బరి పరిశ్రమకు ఊతం లభిస్తుందని చెప్పారు. బేతంచర్ల సబ్ స్టేషన్‌తో నంద్యాల హార్టికల్చర్ హబ్ అభివృద్ధి చెందుతుందని, గ్రీన్‌ఎనర్జీకి ఊతం లభిస్తుందని చెప్పారు.

చెలరేగిపోతున్న వైసీపీ సోషల్ మీడియా

వైసీపీ సోషల్ మీడియా మూకలు అడ్డూ అదుపు లేకుండా చెలరేగిపోతున్నాయని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. నా గురించి, హోమ్ మంత్రి అనిత, ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్, ఆయన పిల్లలు, న్యాయమూర్తుల కుటుంబాల గురించి విచ్చలవిడిగా పోస్టులు పెట్టి ఇష్టారాజ్యంగా దాడులు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. వైసీపీకి వాత పెట్టడం ఖాయమన్నారు. రౌడీలు, గూండాలు ఏ ముసుగులో ఉన్నా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. విచ్చలవిడిగా పోస్టులు పెడుతూ భావప్రకటనా స్వేచ్ఛ అంటే ఊరుకోబోమని తేల్చిచెప్పారు. ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టి 11 సీట్లకు కుదించి ఇంట్లో కూర్చోబెట్టినా వారికి బుద్ధి రాలేదన్నారు. రాజకీయ విమర్శలు మాని వ్యక్తులు, కుటుంబాలపై తప్పుడు ప్రచారాలు చేస్తే ప్రతిఒక్కరిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ జగన్ పాడు చేసిన అమరావతి అభివృద్ధికి శ్రీకారం చుట్టామని తెలిపారు. అండర్ గ్రౌండ్ కేబుల్‌తో అమరావతిని అద్భుత నగరంగా తీర్చి దిద్దాలని చంద్రాబాబు భావిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో మంత్రులు నాదెండ్ల మనోహర్, గుమ్మడి సంధ్యారాణి, విద్యుత్ శాఖ చీఫ్ సెక్రటరి కే.విజయానంద్, ఏపీ జన్కో ఎండీ చక్రధర్‌బాబు, గుంటూరు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎమ్మెల్యే గళ్లా మాధవి, జడ్పీ ఛైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా అధికారులు, రాజధాని రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

ఆత్మాభిమానానికి ప్రతీక అమరావతి : కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

సభలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ అమరావతి తెలుగు ప్రజల ఆత్మాభిమానానికి ప్రతీక అన్నారు. చంద్రబాబు దార్శనికతతోనే అమరావతికి రూ.15 వేల కోట్ల గ్రాంటు వచ్చిందన్నారు. 2 వేల కోట్లతో రైల్వే లైను, ఈఎస్‌ఐ ఆస్పత్రి వచ్చిందని తెలిపారు. అమరావతిని విధ్వంసం చేసిన వైసీపీకి ఆ ప్రాంతంలో ఒక్క ఓటు కూడా పడకూడదని తెలిపారు. గత ప్రభుత్వం కక్ష సాధింపుతో పీపీఏలు రద్దు చేసి, 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై వేల కోట్ల భారం మోపిందన్నారు.

అభివృద్ధి పథంలో : మంత్రి కందుల దుర్గేశ్

సభలో గుంటూరు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేశ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఖజానా మొత్తాన్ని ఖాళీ చేసి పోతే 4 నెలల్లో కూటమి ప్రభుత్వం అద్భుతాలు చేస్తుందన్నారు. రాష్ట్రం అభివృద్ధి పథాన దూసుకుపోతోందన్నారు. నాణ్యమైన విద్యుత్ ద్వారా వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు, ప్రజల జీవన ప్రమాణాలు అభివృద్ధి చెందుతాయని చెప్పారు.

ఏడాదిలో ప్రాజెక్టులు పూర్తి : మంత్రి గొట్టిపాటి

సభలో ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో ఇంధనరంగం నిర్వీర్యమైపోయిందన్నారు. ఇప్పుడు ప్రారంభించిన ప్రాజెక్టులతోపాటు, శంకుస్థాపన చేసిన ప్రాజెక్టులను ఏడాదిలోపు పూర్తి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రజలకు మెరుగైన విద్యుత్ అందిస్తామన్నారు. అండర్‌గ్రౌండ్ విద్యుత్ లైన్లతో ప్రపంచస్థాయి నగరంగా అమరావతిని తీర్చిదిద్దుతామన్నారు.

రేషన్ దందాపై మంత్రి నజర్

- సత్తెనపల్లి, మేడికొండూరు, వట్టిచెరుకూరుల్లో తనిఖీలు
- రైస్‌మిల్లుల్లో 1000 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం గుర్తింపు

(5వ పేజీ తరువాయి)

మహిళలతో నిత్యావసరాల ధరల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆ తర్వాత ఆయన మిల్లుల తనిఖీలకు బయల్దేరడంతో మిల్లర్లు, అధికారులు ఖంగుతిన్నారు. అచ్చంపేటరోడ్డులోని అంజనేయ ట్రేడర్స్ రైస్ మిల్లుకు తాళాలు వేయడంతో వాటిని పగలగొట్టి మంత్రి, లోపలకు వెళ్లారు. మిల్లులో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం నిల్వలు, రేషన్ బియ్యం గోతాలను గుర్తించారు. మంత్రి రాకను తెలుసుకున్న మిల్లు నిర్వాహకులు పాత బిల్లులను, కొన్ని రేషన్ బ్యాగ్‌లను తగలబెట్టగా వాటిని ప్రత్యక్షంగా చూసిన మంత్రి వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దఎత్తున నిల్వలు ఉన్నా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వని అధికారులపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని జేసీకి ఆదేశాలు జారీ చేశారు.

రైస్ మిల్లులోనే ఎండీయూ వాహనం

మేడికొండూరు: మేడికొండ మండలం పేరేచర్ల పరిధిలోని మూడు రైస్ మిల్లులను మంత్రి నాదెండ్ల మనోహర్ గురువారం అకస్మిక తనిఖీ చేశారు. ఒక రైస్ మిల్లులోని బియ్యం పరీక్షకు పంపగా అవి చౌక బియ్యమేనని తేలడంతో స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయాలని ఆదేశించారు. శ్రీలక్ష్మీ గణపతి రైస్ మిల్లులో ఇంటింటికి రేషన్ సరఫరా చేసే వాహనం(ఏపీ 37 టీక్యూ 7793) ఉండడంతో ఆయన ఆశ్చర్యపోయారు. డ్రైవర్‌ను అరెస్టు చేసి వాహనాన్ని స్వాధీనం చేసుకోవాలని పోలీసులను ఆదేశించారు. అనంతరం వెంకటేశ్వర ట్రేడర్స్ అనే రైస్ మిల్లు సిబ్బంది మంత్రి రాకను ఊహించి సీఎంఆర్ రైస్ బ్యాగ్ ట్యాగ్‌లను దహనం చేయగా గమనించి యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిబ్బందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయాలని పోలీసులను మంత్రి ఆదేశించారు. ఆ మిల్లులో


పేరేచర్ల : వెంకటేశ్వర ట్రేడర్స్ రైస్ మిల్లులో బియ్యం తనిఖీ చేస్తున్న మంత్రి మనోహర్

బియ్యాన్ని పరీక్షలకు పంపగా రేషన్ బియ్యం అనే తేలడంతో స్వాధీనం చేసుకుని మిల్లును సీజ్ చేశారు. విఘ్నేశ్వర రైస్ మిల్లులో టార్చ్ లైట్ వెలుగులో బియ్యాన్ని, రికార్డులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో మంత్రి గుంటూరు, పల్నాడు జేసీలు భార్గవ్ తేజ, తూనికలు, కొలతల శాఖ అధికారులు, మేడికొండూరు తహశీల్దార్ కళ్యాణి, పౌరసరఫరాల శాఖ అధికారరులున్నారు. వట్టిచెరుకూరు మండలం అనంతవరప్పాడులోని శ్రీవల్లి రైస్ మిల్లులో తనిఖీలు చేపట్టిన మంత్రి 12 టన్నుల రేషన్ బియ్యాన్ని గుర్తించారు.

పేదల బియ్యం ఇతర దేశాలకు

ఆకస్మిక తనిఖీల అనంతరం మంత్రి మనోహర్ విలేకర్లతో మాట్లాడుతూ పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయన్నారు. పేద ప్రజల వద్ద తక్కువ ధరకు వ్యాపారులు బియ్యాన్ని కొని ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్నారన్నారు. రేషన్ బియ్యం సరఫరాను రాజమార్గంగా చేసుకుని కొంత మంది ఎక్కడికక్కడ మాఫియాలాగా తయారయ్యారన్నారు. వీటిని ప్రక్షాళన చేస్తామన్నారు. తనిఖీల్లో ప్రాథమికంగా వెయ్యి మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యం దొరికిందని, మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. సత్తెనపల్లిలోని ఐదు మిల్లుల నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు.


సత్తెనపల్లి : ఓ దుకాణం వద్ద టీ తాగుతూ ధరలపై మహిళను ప్రశ్నిస్తున్న రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

భూమితో బంధం తెగుతోంది



ఫిలిప్పీన్స్ ప్రెసిడెంట్ అధికారిక నివాసంలో నెక్కంటి సుబ్బారావు నిలువెత్తు ఫోటో ఇప్పటికీ కనిపిస్తుంది. కరువు వచ్చి ప్రపంచం ఆకలితో చచ్చిపోతుంటే సాగులో శాస్త్రవేత్తలు చేయలేని అద్భుతాలు రైతుగా ఆయన చేసి పలువురుకి పట్టెడన్నం పెట్టినందుకు దక్కిన గౌరవ మది. 1967లో వచ్చిన హరిత విప్లవానికి ఆయనే నాంది అయ్యారు. ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ తయారు చేసిన ఐఆర్-8 వరి వంగడానికి ఆయనే బ్రాండ్ అంబాసిడర్‌గా మారి ఆకలితో లక్షలాది మంది చనిపోయిన పశ్చిమ బెంగాల్ సహా, యావత్ భారతావనికి కడుపు నింపారు. సుబ్బారావు సాగు స్ఫూర్తికి మంత్ర ముగ్ధులైన 50 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు, దేశ, విదేశాల వ్యవసాయ సైంటిస్టులు పశ్చిమగోదావరి జిల్లాలోని ఆచంట వచ్చి వెళ్లారు.

- 70 శాతం మంది సాగుకు దూరమయ్యారు
- యుద్ధానికి వెళ్లే సైనికుడిలా రైతు వెన్నుతట్టే వాళ్లు కావాలి
- ఐదు వేల ఎకరాలకు ఒక సైంటిస్ట్ కావాలి
- పెట్టుబడి.. దిగుబడి మధ్య ఉన్న అంతరం తగ్గించాలి
- వ్యవసాయానికి పూర్వ వైభవం రావాలి
- ప్రముఖ రైతు శాస్త్రవేత్త నెక్కంటి సుబ్బారావు

గుంటూరు సిటీ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికీ ప్రపంచంలో ఏ కొత్త వరి వంగడం వచ్చినా ఆయన దగ్గరకు పరిశీలనకు వస్తుంది. 90 పదుల వయసులో కూడా ఆయన 25 ఎకరాల్లో వరి సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. 16 నేషనల్ అవార్డు లు, 3 ఇంటర్నేషనల్ అవార్డులు పొందిన ఆయన ఇప్పటికీ రోజుకు 16 గంటలు వ్యవసాయం గురించే మాట్లాడతారు. అంత పెద్ద వయస్సులో నడిచొస్తున్న వ్యవసాయ యూనివర్సిటీలా అనిపించే నెక్కంటి సుబ్బారావును ఆచార్య ఎన్ జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ ఏడాది ఉత్తమ రైతు పురస్కారానికి ఎంపిక చేసింది. గురువారం ఎన్‌జీరంగా 124వ జయంతిని పురస్కరించుకుని ఆయనను ఘనంగా సన్మానించి, పురస్కారం అందజేసింది. ఈ సందర్భంగా ప్రముఖ రైతు శాస్త్రవేత్త నెక్కంటి సుబ్బారావు ఇప్పటి సాగు పరిస్థితులపై 'ఆంధ్రజ్యోతి' తో మాట్లాడారు.

ప్రస్తుత సాగు పరిస్థితి ఎలా ఉంది ?

సుబ్బారావు: ఇప్పుడు సాగు పరిస్థితులు అంత ఆశాజనకంగా లేవు. నూటికి 70 శాతం మంది పొలాలు కౌలుకు ఇచ్చి విదేశాలకు, ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోతున్నారు. ఎక్కువ భూమి కౌలు రైతుల చేతిలోనే ఉంది. భూమికీ యజమానితో ఉన్న బంధం తెగిపోతోంది. దాన్ని పునరుద్ధరించాలి. కారణం ఏదైనా కావచ్చు కానీ సాగు విస్తీర్ణం పడిపోతే రాష్ట్రం దుర్భిక్షం అవుతుంది. మిగిలిన అన్ని రంగాల్లో పురోగతి సాధించి ఇక్కడ ఫెయిల్ అయితే ఆ నష్టం ఏమి చేసినా పూడ్చలేము.

ఎక్కువ మంది సాగుకు దూరం కావటానికి కారణం?

నెక్కంటి : కారణాలు అనేకం. కొందరు పిల్లలు దగ్గరకు అని వెళ్లిపోతున్నారు. కొందరు సాగు గిట్టుబాటు కావడం లేదని దూరం అవుతున్నారు. పెట్టుబడికీ దిగుబడికీ మధ్య పెద్ద అంతరం ఏర్పడింది. నేను సాగులో అడుగుపెట్టినప్పుడు అసలు మాకు ఎరువుల సంగతి తెలియదు. గోదావరి నుంచి వచ్చే నీళ్ల ఎర్రగా ఒండ్రు మట్టి తో వచ్చేవి. ఫిలిప్పీన్స్ తయారు చేసిన ఐఆర్-8 వరి వంగడం మొదట కోయంబత్తూరు వెళ్ళింది. అక్కడ మిగిలిన నారు తెచ్చి నేను సాగు చేశాను. వాళ్ళు ఎరువులు, మందులు ఎక్కువగా కొట్టారు. దాంతో ఎకరాకు 25 బస్తాలు దిగుబడి వచ్చింది. నేను ఏమి వాడలేదు ఎకరాకు 40 బస్తాలు దిగుబడి వచ్చింది. అది చూసే దేశం అంతా నా చుట్టూ తిరిగింది. ఇప్పుడు ఎంత ఎక్కువ ఎరువులు, పురుగు మందులు వాడితే అంత మంచి రైతు అంటున్నారు. ఈ ధోరణి మారాలి. భూమి తల్లిని కాపాడాలి.అవసరం ఉన్నా లేకున్నా వాడుతున్న రసాయన ఎరువులు, మందుల వల్ల నేల నిస్సారం అవుతుంది. ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలు పెరగాలి.

సాగు శాతం పెంచాలంటే?

సుబ్బారావు: అది ప్రభుత్వం చేతుల్లో మాత్రమే ఉంది. అనేక రంగాలను ప్రోత్సహిం చటానికి ఏవిధంగా అయితే సబ్సిడీ లు ఇస్తున్నారో ఇక్కడ కూడా అంతకంటే ఎక్కువ ఇవ్వాలి. సాగుచేసే రైతులను ప్రోత్సహించాలి. పండించిన పంటకు మద్దతు ధర ఇవ్వాలి. ఆ మద్దతు ధర నిర్ణయం రైతుల సమక్షంలో జరగాలి.ఏసీ గదుల్లో కూర్చొని నిర్ణయించే మద్దతు ధర వల్ల రైతుకు కష్టానికి తగిన ఫలితం రాదు. ప్రస్తుతం 30 వేల ఎకరాలకు ఒక వ్యవసాయ అధికారి ఉ న్నారు. ఆయన ఎంత భూమిని పరీక్షించగలడు. ఎంత మందికి సరైన సమయంలో సల హాలు ఇవ్వగలడు. ఆ విధానం మారాలి. ప్రతి 5 వేల ఎకరాలకు ఒక శాస్త్రవేత్త కావాలి. యుద్ధానికి వెళ్లే సైనికుడ్ని వెన్ను తట్టి పంపినట్లు రైతును అలా వెన్ను తట్టే వాళ్ళు కావాలి. రైతు చెయ్యి ఎప్పుడూ పైన ఉంటేనే రాష్ట్రం సుభిక్షం అవుతుంది. అందరూ సాఫ్ట్‌వేర్, హార్డ్ వేర్లు అయితే అన్నం ఎవరు పెడతారు. కాబట్టి మన ఆలోచన ధోరణిలో కొంత మార్పు రావాలి. తల్లిదండ్రులు వాళ్ళ పిల్లలు రైతులు అయినందుకు గర్వపడే రోజులు రావాలి.

వైసీపీకి సుచరిత గుడ్ బై

- జగన్‌కి చెప్పి వచ్చిన మాజీ హోంమంత్రి
- తాడికొండకు కొత్త ఇన్‌చార్జ్ కోసం అన్వేషణ



గుంటూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): వైసీపీకి మాజీ హోం మంత్రి మేకతోటి సుచరిత గుడ్ బై చెప్పారు. రెండు రోజుల క్రితం వైసీపీ అధినేత, మాజీ ముఖ్య మంత్రి జగన్‌ను కలిసిన సుచరిత తాను ఇక రాజకీయాల్లో కొనసాగలేనని చెప్పినట్లు తెలిసింది. ఆరోగ్యం కూడా అంతగా సహకరించడం లేదని అందువల్ల తాడికొండ ఇన్‌చార్జ్ బాధ్యతల నుంచి తప్పుకుంటున్నట్లు తెలియజేశారు. గత ఎన్నికల్లో ఆమె తాడికొండ నుంచి పోటీ చేసి ఓడిపో యిన విషయం తెలిసిందే. కొద్ది రోజుల క్రితం ఆమె జనసేనలో చేరబోతున్నట్లు ప్రచారం జరగ్గా ఆమె ఖండించారు. గత ఎన్నికల్లోనే ఆమె పోటీకి అంతగా సుముఖత చూపలేదు. వాస్తవానికి ఆమె సొంత నియోజకవర్గం ప్రత్తిపాడు అనే చెప్పవచ్చు. ఆ నియోజకవర్గం నుంచే ఆమె 2009, 2012, 2014, 2019 ఎన్నికల్లో పోటీ చేశారు. 2014 ఎన్నికల్లో మినహా మిగతా మూడు ఎన్నికల్లో గెలుపొందారు. 2019 ఎన్నికల్లో విజయం సాధించిన తరువాత ఆమెను జగన్ తన కేబినెట్‌లోకి తీసుకొని కీలకమైన హోం శాఖను అప్పగించాడు. మంత్రి పదవిలో రెండున్నరేళ్ళ పాటు కొనసాగినప్పటికీ తనకు ఎటువంటి పవర్ లేకుండా చేశారని అప్పట్లోనే ఆమె మనస్థాపానికి గురయ్యారు. పైగా పూర్తి కాలం మంత్రిగా పనిచేసే అవకాశం కూడా ఇవ్వకుండా మధ్యలోనే తప్పించి ఇదే జిల్లా నుంచి విడదల రజనీకి మంత్రి పదవి కట్టబెట్టటంతో ఆమె అవమానానికి గురయ్యారు. 2024 ఎన్నికల్లో ప్రత్తిపాడు నుంచి తిరిగి పోటీ చేయాల్సిన సుచరిత అక్కడ నుంచి పోటీ చేసేందుకు అంగీకరించలేదు. మంత్రిగా ఆమె ఉన్న సమయంలో కుటుంబీకుల వ్యవహారం మూలంగా నియోజకవర్గంలో సొంత పార్టీలోనే వ్యతిరేకత రావటంతో తిరిగి అక్కడ పోటీ చేసినా గెలవలేననే భయంతో వెనుకంజ వేసింది. అదే సమయంలో తాడికొండ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న ఉండవల్లి శ్రీదేవి జగన్‌కు ఝలక్ ఇచ్చి పార్టీని వీడటంతో సుచరితను తాడికొండకు వలస తీసుకెళ్ళటం జరి గింది. తాడికొండలో ఓటమి అనంతరం ఆమె నియో జకవర్గానికే కాకుండా పార్టీ కార్యక్రమాలకు కూడా దూరంగా ఉంటున్నారు. ఇటీవల రెండు పర్యాయాలు జగన్ జిల్లా పర్యటనకు వచ్చినప్పటికీ ఆమె ఆ కార్య క్రమాల్లో పాల్గొనలేదు. ఈ నేపథ్యంలో ఆమె బుధ వారం జగన్‌ను కలిసి రాజకీయాల నుంచి తప్పుకుం టున్నట్లు తెలిపారు. తాడికొండకు కొత్త ఇన్‌చార్జ్ కోసం జగన్ అన్వేషిస్తున్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పది పరీక్ష ఫీజు చెల్లింపు గడువు పొడిగింపు

నరసరావుపేట కల్చరల్, నవంబరు 7: పది పరీక్షలు రాసే విద్యార్థులు నవంబరు 18వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించుకోవచ్చని బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఫీజు చెల్లించవచ్చని, తర్వాత డిసెంబరు 10వ తేదీ వరకు జరిమానాతో ఫీజు చెల్లించాలన్నారు. రుసుము బోర్డు వెబ్‌సైట్ నుంచి స్కూల్ లాగిన్ ద్వారా మాత్రమే చెల్లించాలన్నారు.



అత్యాచారయత్నంపై వివాహిత ఫిర్యాదు

నాదెండ్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తనపై ఒక వ్యక్తి అత్యాచార యత్నానికి ప్రయత్నించాడని గణపవరం గ్రామానికి చెందిన ఒక వివాహిత నాదెండ్ల పోలీసులకు ఫిర్యాదు చేసింది. గ్రామ పరిధిలోని చవిటిపాలెంకు చెందిన ఆటో డ్రైవర్ బత్తుల భరత్ బుధవారం తన ఇంట్లోకి వచ్చి అత్యాచార యత్నానికి ప్రయత్నించగా తాను పెద్దగా అరవటంతో పరారయ్యాడని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. దీనిపై నాదెండ్ల పోలీసులు విచారణ జరుపుతున్నామని తెలిపారు.

బైక్ దహనంపై కేసు నమోదు

నాదెండ్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరులో మోటారు సైకిల్ దహనంచేసిన సంఘటనకు సంబందించి నాదెండ్ల పోలీసులు గురువారం కేసు నమోదుచేశారు. జనవరి 17వ తేదీన నార్నె హనుమకు చెందిన మోటారు బైక్‌ను మన్నెపల్లి పవన్‌కుమార్, బండారు సాయిలు దహనం చేశారు. ఈ విషయమై పెద్దల ముందు నష్టపరిహారం ఇస్తామని నిందితులు పెద్దల ముందు హామీ ఇచ్చారు. కాగా నష్ట పరిహారం ఇవ్వకపోవటంతో బాధితుడు హనుమ చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బొప్పూడిలో ఐదుగురు జూదరుల అరెస్టు

చిలకలూరిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం బొప్పూడి గ్రామ పరిధిలోని పొలాలలో పేకాట ఆడుతున్న ఐదుగురిని చిలకలూరి పేట రూరల్ పోలీసులు మంగళవారం అరెస్టుచేశారు. వారి వద్ద నుంచి రూ.12,400లు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేశారు. రూరల్ ఎస్ఐ జి.అనిల్ కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నైపుణ్యాభివృద్ధి సర్వేపై శిక్షణ

చిలకలూరిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నైపుణ్యాభివృద్ధి సర్వేపై అవగాహన కల్పించేందుకు ఒక సమావేశాన్ని ఏర్పాటుచేశారు. మీ సమావేశంలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లకు శిక్షణ కార్యక్రమం కూడా నిర్వహించారు. నైపుణ్యాభివృద్ధి గణన కోసం చిలకలూరిపేట మండల పరిధిలోని ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, స్కిల్ డెవలప్ మెంట్ ఏరియా మేనేజర్ సురేష్, పీఆర్ అండ్ ఆర్‌డీఈవో ఈ పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

సాదినేని చౌదరయ్యకు ఘన నివాళి

చిలకలూరిపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం మద్దిరాలలోని జవహర్ నవోదయ విద్యాలయ స్థలదాత, పట్టణంలోని సాదినేని చౌదరయ్య పబ్లిక్ స్కూల్ వ్యవస్థాపకుడు దివంగత సాదినేని చౌదరయ్య 25వ వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ధనలక్ష్మి గ్రూపు సంస్థలకు చెందిన పేర్ని వీరనారాయణ, సాదినేని హనుమంతరావు, ఎం లింగయ్య చౌదరి, పంగులూరి సుబ్బారావు, స్కూలు డైరెక్టర్ సి ప్రభాకర్ రెడ్డి, ప్రిన్సిపల్ భాషా తదితరులు స్కూలు ఆవరణలోని చౌదరయ్య విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

పాఠశాలలో డీఈవో తనిఖీ

రొంపిచర్ల, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచవరం, రెడ్డిపాలెంలోని ప్రభుత్వ పాఠశాలలను జిల్లా విద్యా శాఖ అధికారి చంద్రకళ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఆమె వెంట ఎంఈవో బ్రహ్మేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

డ్వాక్రా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే ప్రత్తిపాటి

యడ్లపాడు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా)ను చైతన్యవంతం చేసింది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడని, ఈ డ్వాక్రా సంఘాలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కృషిచేస్తున్నదని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో యడ్లపాడులోని టీటీడీ కల్యాణ మండపంలో నియోజకవర్గ డ్వాక్రా సంఘాలలోని మహిళా పారిశ్రామికవేత్తలకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని మూడు మండలాలు, పట్టణ పరిధిలో 42వేల మంది మహిళలు డ్వాక్రా సంఘాలలో సభ్యులుగా ఉన్నారన్నారు. సభ్యులందరూ శిక్షణ కార్యక్రమాలలో పాల్గొని భవిష్యత్ వ్యాపారవేత్తలుగా ఎదగాలన్నారు. శిక్షణ పొందిన మహిళలకు రూ.లక్ష నుంచి రూ.50లక్షల వరకు ష్యూరిటీ లేని రుణాన్ని పొందేందుకు అవకాశం ఉందని, తద్వారా స్వయం సమృద్ధిని సాధించాలన్నారు. ఇటీవల లీడర్లు, వీవోఏలు, సీసీలపై అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్నాయని, ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా పనిచేయాలని సూచించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇర్లపాడు, నాదెండ్ల, సాతులూరు, గణపవరం, కావూరు, యడ్లపాడు, తిమ్మాపురం, సందెపూడి, బోయపాలెం గ్రామాలలో లీడర్లు, వీవోఏలు, సీసీలు అవినీతికి పాల్పడ్డారన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్ రాంప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఒక్క ఎన్‌పీఏ ఖాతా కూడా లేకుండా డ్వాక్రా సంఘాలు ఉన్నాయని, అది ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. అనంతరం నియోజకవర్గంలోని 992 సంఘాలకు రూ.70కోట్ల 80లక్షల రుణ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.


డ్వాక్రాసంఘాల సభ్యులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్, ఎంపీడీవో హేమలత, డీపీఎం సీహెచ్ శ్రీనివాస్, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, మాజీ జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కుర్రా రత్తయ్య, టీడీపీ నాయకులు కందిమళ్ళ రఘురామారావు, కె సాయిబాబు, జవ్వాజి మదన్‌మోహన్, బి.సత్యన్నారాయణ, పి.వెంకయ్య, వెలుగు సీసీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

12, 13 తేదీల్లో కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో మహిళా కబడ్డీ పోటీలు

నరసరావుపేట టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్శిటీ అంతర కళాశాలల మహిళా కబడ్డీ పోటీలు ఈ నెల 12, 13 తేదీలలో పట్టణంలోని చిలకలూరిపేట బైపాస్ రోడ్డులోని కృష్ణవేణి డిగ్రీ కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఇందులో భాగంగా ఏఎన్‌యూ మహిళ కబడ్డీ జట్టు ఎంపిక జరుగుతుందన్నారు. 11వ తేదీలోగా టోర్నమెంట్‌లో పాల్గొనే జట్టు వివరాలు తెలియజేయాలన్నారు. అదనపు సమాచారం కోసం టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పీడీ ఈదర ఆదిబాబు, 9985373066 నంబరును సంప్రదించాలన్నారు.



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ఎంఏఎం గ్రూప్ చైర్మన్ రామశేషగిరిరావు, ప్రిన్సిపాల్ సీహెచ్ వెంకటరావు తదితరులు

అంతర కళాశాలల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

నరసరావుపేట టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున యూనివర్శిటీ అంతర కళాశాల మెన్ అండ్ ఉమెన్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్, యూనివర్శిటీ జట్టు ఎంపికలు ఎంఏఎం కళాశాల, ఏ ముప్పాళ్ళ ధనలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ఆధ్వర్యంలో ఆచార్య నాగార్జున నగర్‌లో జరిగాయని కళాశాల చైర్మన్ మేదరమెట్ల రామశేషగిరిరావు గురువారం తెలిపారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆచార్య నాగార్జున యూనివర్శిటీ క్యాంపస్‌లో జరిగిన ఈ కార్యక్రమాన్ని డాక్టర్ పీటీఎస్ పాల్‌కుమార్, ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ వైస్ ప్రెసిడెంట్ బీ వెంకటరామయ్య, సెక్రటరీ దిన్నాబాబు, ఏఎన్‌యూ యోగా కోఆర్డినేటర్ డాక్టర్ డీ సూర్యనారాయణ, ధనలక్ష్మి ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ వెంకటరావు, సెలక్షన్ కమిటీ సభ్యులు కే భాను ప్రతాప్, డాక్టర్ ఎన్ శేషగిరిరావు, అరవింద్, బలరాం నాయక్, పర్యవేక్షించారు. ఈ పోటీలలో పురుషుల వెయిట్ లిఫ్టింగ్‌లో 8మంది, మహిళల విభాగంలో నలుగురు ఎంపికయ్యారన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో ధనలక్ష్మీ వ్యాయామ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ఈపూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏఎన్‌యూ అంతర కళాశాలలకు ఈ నెల 6వ తేదీన జరిగిన సౌత్ వెస్ట్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో ధనలక్ష్మీ వ్యాయామ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ప్రిన్సిపాల్ చుండు వెంకటరావు తెలిపారు. మహిళా విభాగంలో 49కేజీల కేటగిరిలో ఎం.అనూష గోల్డ్ మెడల్ సాధించారు. 59 కేజీల కేటగిరిలో ఎం.రాజేశ్వరి, కే వెంకటేశ్వరి సిల్వర్ మెడల్ సాధించారు. పురుషుల విభాగంలో 61 కేజీల కేటగిరిలో ఆర్.హనుమానాయక్ సిల్వర్ మెడల్ సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

సౌత్ వెస్ట్ విశ్వవిద్యాలయాల పోటీలకు అనూష ఎంపిక


ఎం అనూష

ఈపూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళ ధనలక్ష్మీ వ్యాయామ కళాశాల విద్యార్థిని ఎం.అనూష సౌత్ వెస్ట్ విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ చుండు వెంకటరావు గురువారం తెలిపారు. ఈ నెల 6వ తేదీన జరిగిన అంతర కళాశాలల సౌత్ వెస్ట్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో మహిళా విభాగంలో 49కేజీలలో కేటగిరిలో గోల్డ్‌మెడల్ సాధించినట్లు తెలిపారు. నవంబరు 26వ తేదీ నుంచి జరిగే వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఏఎన్‌యూకి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఎరువుల దుకాణాల్లో ఎడీఏ రవిబాబు తనిఖీ

వినుకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) అనుమతులు లేని పురుగు మందులు, ఎరువులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎడీఏ రవిబాబు తెలిపారు. పట్టణంలో పురుగుమందుల దుకాణాల్లో గురువారం సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు.

శిశువుల సంరక్షణపై అవగాహన సదస్సు

నరసరావుపేట లీగల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): శిశువుల సంరక్షణపై మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని పాత పల్నాడు బస్టాండ్‌లోని ప్రభుత్వ వైద్యశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ బీ రవి మాట్లాడుతూ శిశువులు తల్లి గర్భంలో ఉన్నప్పుడు, జన్మించిన సంవత్సర కాలం పాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రు నాయక్, ఆర్ఎంవో డాక్టర్ దయానిధి, న్యాయవాదులు బ్లెసీనా, హనుమంతరావు, ఏడుకొండలు, డాక్టర్ హనుమకుమార్, వైద్యశాల సిబ్బంది, నవజాత శిశువుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సైన్స్ ఎగ్జిబిషన్, క్విజ్

నరసరావుపేట టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెట్లూరివారిపాలెంలోని ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం శాస్త్రవేత్త సర్ డాక్టర్ సీవీ రామన్ జయంతి సందర్భంగా పల్నాడు జిల్లా ప్రాంతంలోని ఇంటర్మీడియేట్ కళాశాలల విద్యార్థులకు సైన్స్ ఎగ్జిబిషన్, క్విజ్ ప్రోగామ్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల సెక్రటరీ అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ సర్ సీవీ రామన్ భారతీయ శాస్త్రలోకానికి ఎన్నో గొప్ప సేవలు అందించారని అన్నారు. రామన్ ఎఫెక్ట్ అనే ప్రతిష్టాత్మక ఆవిష్కరణకు 1930లో నోబెల్ బహుమతి లభించిందన్నారు. క్విజ్, సైన్స్ ఎగ్జిబిషన్‌లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.10 వేలు, రెండవ బహుమతిగా రూ 5 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున్, డిప్లొమా ప్రిన్సిపాల్ డాక్టర్ కే కృష్ణారెడ్డి, ఫార్మసీ ప్రిన్సిపాల్ డాక్టర్ పీ భార్గవ భూషణ్‌రావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీలలో ఎస్ఎస్ఎన్ విద్యార్థుల ప్రతిభ

నరసరావుపేట టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 విభాగం స్విమ్మింగ్ పోటీలలో ఎస్ఎస్ఎన్ కళాశాల విద్యార్థులు ప్రతిభచాటారని ప్రిన్సిపాల్ డాక్టర్ ముప్పల సుబ్రహ్మణ్యం సుధీర్ గురువారం తెలిపారు.


ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న కపలవాయి విజయకుమార్, సుబ్బరాయగుప్తా తదితరులు

ఎస్ఎస్ఎన్ కళాశాల స్విమ్మింగ్ పూల్‌లో జరిగిన 68వ రాష్ట్ర స్థాయి అంతర్ జిల్లాల అండర్-19 విభాగంలో కళాశాలకు చెందిన వై మధుకిషోర్ 100 మీటర్ల బటర్‌ఫ్లై ఈవెంట్‌లో బంగారు పతకం, 50 మీటర్ల బటర్‌ఫ్లైలో బంగారు పతకం, 200 మీటర్ల ఈవెంట్‌లో బంగారు పతకం సాధించారు. కే సాకేత్ 50 మీటర్ల బటరుఫ్లైలో రజత, 200 మీటర్ల బటర్‌ఫ్లైలో రజత, 400 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో కాంస్య పతకం సాధించారు. రాష్ట్ర స్థాయిలో బంగారు, వెండి, కాంస్య పతకాలు సాధించిన వై మధుకిషోర్, కే సాకేత్‌లను పాలకవర్గ అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నాగసరపు సుబ్బరాయగుప్త, వైస్ ప్రెసిడెంట్ పి.వెంకటేశ్వరరావు జాయింట్ వి.వెంకటఅప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ పీ శ్రీనివాస్ సాయి, పీడీ డాక్టర్ వై.మధుసూధన్‌రావు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాలలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్

నరసరావుపేట టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేసానుపల్లిలోని ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల బీ టెక్, ఎంబీఏ విద్యార్థులకు సదర్లాండ్ ఆధ్వర్యంలో క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ గురువారం నిర్వహించారని ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు తెలిపారు. ఇంటర్వ్యూలో 180 విద్యార్థులు పాల్గొనగా గ్రూప్ డిస్కషన్‌లో 21 మంది విద్యార్థులకు ప్రాసెస్ అసోసియేట్ నియామకాలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.2.70 లక్షలు వేతనంగా అందజేస్తారని, 2025 జూన్‌లో ఉద్యోగాలలో చేరవలసి ఉంటుందని కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి డాక్టర్ షేక్ ముజీర్ తెలిపారు.

నైపుణ్యాల సర్వేని సమర్థవంతంగా నిర్వహించాలి: ఎంపీడీవో

శావల్యాపురం, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాల గణనను సచివాలయ ఉద్యోగులు సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలని ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులకు నైపుణ్యాల గణనపై గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే జీవీ

● ప్రమాదంలో గాయపడిన వృద్ధుడు హాస్పటల్‌కు తరలింపు


రోడ్డుప్రమాదంలో గాయపడిన వృద్ధుడిని తన కారులోకి ఎక్కిస్తున్న ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, సిబ్బంది

వినుకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) రోడ్డు ప్రమాదంలో గాయపడి తీవ్ర రక్తస్రావంతో, ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతున్న క్షతగాత్రుడిని చూసిన ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మానవత్వాన్ని చూపారు. రక్తం మడుగులో ప్రాణాపాయస్థితిలో ఉన్న వృద్ధుడిని గురువారం తన కారులో ఎక్కించుకుని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. స్థానికులు తెలిపిన వివరాలను ప్రకారం గ్రామానికి చెందిన గాదె మహానందిరెడ్డి (78) వ్యక్తిగత పనులు ముగించుకుని భోజనం చేసేందుకు ఇంటికి వస్తుండగా వినుకొండ నుంచి నరసరావుపేటవైపు ప్రయాణిస్తున్న లారీ ఢీ కొనడంతో తీవ్రగాయాలయ్యాయి. ఇదే సమయంలో వినుకొండకు వస్తున్న ఎమ్మెల్యే జీవీ తన కాన్వాయ్ ఆపి, గాయాలతో పడిఉన్న వృద్ధుడిని తనకారులో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమచికిత్స చేసి, సిటీస్కాన్ చేయించారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం గుంటూరుకు తరలిస్తుండగా మహానందిరెడ్డి మృతి చెందాడు. ఈ సమాచారం తెలుసుకుని జీవీ తీవ్ర మనోవేదనకు గురయ్యారు. మృతుడికి భార్య రమణమ్మ, కుమారుడు పూర్ణచంద్రరావు, కుమార్తె రమా ఉన్నారు.

స్కూల్ ఎగ్గొట్టే పిల్లాడిలా జగన్ తీరు: ఎమ్మెల్యే జీవీ

వినుకొండ, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా చేసినా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీరు స్కూల్ ఎగ్గొట్టే పిల్లాడి కంటే దారుణంగా ఉందని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. 151సీట్లు అని విర్రవీగిన అహంకారిని 11సీటకు పరిమితం చేసినా అతడి తీరు మారకపోతే ఎలా అని ప్రశ్నించారు. అసెంబ్లీకి వెళ్లి ఏం లాభం అంటూ గురువారం వైసీపీ అధినేత జగన్ చేసి వ్యాఖ్యలపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. 40శాతం ప్రజలు ఓటు వేశారని చెప్పు కుంటున్న జగన్‌రెడ్డి వాళ్ల కోసమైనా అసెంబ్లీకి ఎందుకు హాజరు కారో చెప్పాలని నిలదీశారు.

స్వాములకు ఖాసింసైదా అన్నదానం

వినుకొండ టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) పట్టణంలోని తిమ్మాయిపాలెం రోడ్డులోని గమిడి ఆంజనేయస్వామి దేవస్థానంలో మాలధారణ చేసిన స్వాములకు టీడీపీ నాయకుడు కాసింసైదా (రియల్ ఎస్టేట్ జానీ) తన సొంత నిధులతో సుమారు 100 మంది స్వాములకు సద్ది ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఈ కార్యక్రమంలో పాల్గొని, మత సామరస్యాన్ని చాటుకున్న ఖాసింసైదాను అభినందించారు.


నరసరావుపేట మండలం ములకలూరులో ప్రజలవద్ద నుంచి వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

● ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, నవంబరు 7: అర్హులైన పేదలందరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. నరసరావుపేట మండలం ములకలూరులో ప్రజా సమస్యలపై ప్రజా వేదిక కార్యక్రమం గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసరావుపేట శ్యాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, తెలుగుదేశంపార్టీ నియోజకవర్గం కూటమి నేతలు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

28 మంది తిరుమల విద్యార్థులకు ఉద్యోగాలు

నరసరావుపేట రూరల్, నవంబరు 7: స్థానిక జొన్నలగడ్డలోని తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తిరుమల ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 28 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా వైపీ నారాయణ తెలిపారు. చెన్నైకు చెందిన జెస్టాంప్ కంపెనీ ప్రతినిధులు గురువారం కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. వివిధ బ్రాంచిల నుంచి 210మంది విద్యార్థులు పాల్గొనగా వారిలో తిరుమల ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు 28మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రావెల సత్యనారాయణ, కళాశాల చైర్మన్ బొల్లా బ్రహ్మనాయుడు, వైస్‌చైర్మన్ బత్తిన నాగేశ్వరరావు, కోశాధికారి దండా బ్రహ్మానందం అభినందించారు.

సబ్సిడీ సిలిండర్ల కోసం గ్యాస్‌పైపు తీసుకోమనటం దారుణం

నరసరావుపేట అర్బన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రొంపిచర్ల మండలంలోని ఇండేన్ గ్యాస్ వినియోగదారులు ప్రభుత్వం ప్రకటించిన రాయితీ సిలిండర్ తీసుకోవాలంటే గ్యాస్ పైపు తీసుకోవాలంటూ నిర్వాహకులు చెప్పటం దారుణమని పలువురు వినియోగదారులు గురువారం పేర్కొన్నారు. రూ.200 చెల్లించి గ్యాస్ పైపు తీసుకుంటేనే రాయితీ డబ్బులు ఎకౌంట్లలో పడతాయని చెపుతున్నారన్నారు. పైపు తీసుకుంటేనే సిలిండర్ ఇస్తామని చెప్పటం విడ్డూరంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్న నల్లపాటి, నాగసరపు

నరసరావుపేట టౌన్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): టీడీపీ శాశ్వత సభ్యత్వం టీడీపీ రాష్ట్ర కార్యనిరాహక కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాదు, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయుగుప్త తీసుకున్నారు. నరసరావుపేట టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో లక్ష రూపాయలు చొప్పున చెల్లించి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు నుంచి శాశ్వత సభ్యత్వం పొందారు.